
జాతీయ తెలుగు దినపత్రిక
ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం
మహబూబ్‌నగర్
నాగర్ కర్నూల్, వనపర్తి
జోగులాంబ గద్వాల
నారాయణపేట
గురువారం, మే 14, 2026 పేజీలు : 9







## జనగణన హౌస్ లిస్టింగ్‌లో ప్రతి ఇల్లు
# నమోదు కావాలి

### గద్వాల కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్



**ధరూర్ మే 13(ప్రజా జ్యోతి):** జనగణన హౌస్ లిస్టింగ్ ప్రక్రియలో ప్రతి ఇంటిని తప్పనిసరిగా లెక్కించాలని,బౌండరీ మ్యాపింగ్‌ను ఖచ్చితంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ ఆదేశించారు.బుధవారం ధరూర్ మండలం మార్లబీడు గ్రామంలో నిర్వహిస్తున్న జనగణన హౌస్ లిస్టింగ్ ప్రక్రియను కలెక్టర్ పరిశీలించారు.ఈ సందర్భంగా ఎన్యుమరేటర్లు,సూపర్వైజర్లు,సంబంధిత సిబ్బందితో మాట్లాడి పనితీరును సమీక్షించారు.ఎన్యుమరేటర్లు తమ పరిధిలోని బౌండరీలు,రహదారులు, వీధులు,ఇంటి నంబర్లపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని సూచించారు.మ్యాపింగ్ ప్రక్రియలోచెరువులు,రహదారులు,దేవాలయాలు,చర్చిలు,పాఠశాలలు వంటి ప్రాధాన్య ప్రాంతాలను స్పష్టంగా గుర్తించాలని తెలిపారు.పెన్సిల్‌తో డాటెడ్ లైన్లు ఉపయోగించి

## బక్రీద్ సందర్భంగా కట్టుదిట్టమైన భద్రతా
# ఏర్పాట్లు చేయాలి

### తెలంగాణ రాష్ట్ర డీజీపీ సి.వి.ఆనంద్




## బడి బయట పిల్లలు లేని
# జిల్లాగా మార్చుదాం

### నారాయణపేట జిల్లా కలెక్టర్ సీ హెచ్ ప్రియాంక




**నారాయణపేట ప్రతినిధి మే 13 ప్రజా జ్యోతి** నారాయణ పేటను బడి బయట ( డ్రాఫ్ అవుట్) పిల్లలు లేని జిల్లాగా మార్చేందుకు కృషి చేద్దామని జిల్లా కలెక్టర్ సీ హెచ్ ప్రియాంక పిలుపునిచ్చారు. ప్రభుత్వం విద్యకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. విద్య కోసం కేటాయిస్తున్న నిధులను సద్వినియోగం చేసుకుని ప్రభుత్వ పాఠశాలల




## మొక్కజొన్న రైతుల సమస్యల పరిష్కారానికి
# కట్టుబడి ఉన్నాం

**- ధాన్యం కొనుగోలు ప్రక్రియలో పారదర్శకతకు ప్రాధాన్యం**
**-కొనుగోలు కేంద్రాలలో అన్ని సౌకర్యాలు కల్పించాలి**
**- రవాణా, హమాలి సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలి**
**హేమంత్ కేశవ్ పాటిల్**



**నాగర్ కర్నూల్ మే 13( ప్రజా జ్యోతి జిల్లా ప్రతినిధి)** బుధవారం సాయంత్రం జిల్లా ఎస్పి డాక్టర్ సంగ్రామ్ సింగ్ జీ పాటిల్ తో కలిసి జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ పట్టణంలోని నెల్లికొండ మార్కెట్ యార్డును ఆకస్మికంగా సందర్శించి, అక్కడ కొనసాగుతున్న మొక్కజొన్న ధాన్యం కొనుగోలు ప్రక్రియను క్షుణ్ణంగా పరిశీలించారు. మార్కెట్ యార్డులో రైతులకు అందుతున్న సౌకర్యాలు, ధాన్యం తూకం విధానం, నాణ్యత ప్రమాణాలు, నిల్వ ఏర్పాట్లు, రవాణా సదుపాయాలపై అధికారులను అడిగితెలుసుకున్నారు.ముఖ్యంగా అక్కడే పని చేస్తున్న బీహార్ నుంచి వచ్చిన కూలీలతో కలెక్టర్ మాట్లాడారు ఇంకా అవసరమైన కూలీలను రప్పించేలా చూడాలని వారిని కోరారు. రోజుకు ఎన్ని లారీల్లో లోడింగ్ అన్లోడింగ్ ప్రక్రియ జరుగుతుందని

## మొక్కజొన్న రైతుల సమస్యల పరిష్కారానికి

# కట్టుబడి ఉన్నాం



కూలీలను అడిగి తెలుసుకున్నారు రోజువారి కూలీలు అందుతున్నాయా లేదా అని కార్మికులను అడిగి తెలుసుకున్నారు. వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ అధికారులు కొనుగోలు ప్రక్రియపై వివరాలను ఎప్పటికప్పుడు నమోదు చేయాలని కలెక్టర్ఆదేశించారు. అనంతరం ఆయన నేరుగా రైతులతో మాట్లాడి వారి ఇబ్బందులనుతెలుసుకున్నారు. ముఖ్యంగా ధాన్యం అమ్మకాల సమయంలో ఆలస్యం, తూకం ప్రక్రియలో పారదర్శకత, చెల్లింపుల జాప్యం వంటి అంశాలపై రైతులు కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. రైతులు తెలిపిన సమస్యలను శ్రద్ధగా విన్న కలెక్టర్, వెంటనే సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. రానున్న రెండు మూడు రోజుల్లో పూర్తిస్థాయిలో సమస్యలు పరిష్కరించే విధంగా జిల్లా యంత్రాంగం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నట్లు కలెక్టర్ తెలిపారు. జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ మాట్లాడుతూ, రైతుల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని అన్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా జిల్లా యంత్రాంగం సమన్వయంతో పనిచేస్తుందని తెలిపారు. నాగర్ కర్నూల్ జిల్లాలో మొక్కజొన్న రైతుల సమస్యల పరిష్కారానికి జిల్లా యంత్రాంగం కట్టుబడి ఉందని, జిల్లాలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలలో రైతుల వద్ద నుండి ప్రభుత్వ నిబంధనలు మరియు నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా ఉన్న ధాన్యాన్ని మాత్రమే కొనుగోలు చేయాలని అధికారులను ఆదేశించారు.

రైతులు తమ పంటను మార్కెట్ యార్డుకు తీసుకొచ్చిన వెంటనే తూకం ప్రక్రియ పూర్తి చేయాలని, ఎలాంటి అనవసర ఆలస్యం జరగకుండా చూడాలని సూచించారు. ధాన్యం నాణ్యత పరీక్షలను పారదర్శకంగా నిర్వహించాలని, రైతులకు స్పష్టమైన సమాచారం అందించాలని అధికారులను ఆదేశించారు. అలాగే కొనుగోలు అనంతరం రైతుల ఖాతాల్లో చెల్లింపులు త్వరితగతిన జమయ్యేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.

రైతులు కష్టపడి పండించిన పంటకు సరైన మద్దతు ధర లభించేలా ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోందని కలెక్టర్ తెలిపారు. అకాల వర్షాల నేపథ్యంలో రైతులు పండించిన వరి ధాన్యం తడిసిపోకుండా, నాణ్యత దెబ్బతినకుండా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఇందుకోసం జిల్లాలో ముందుగా గుర్తించిన గోదాములలో ధాన్యాన్ని భద్రపరచి, ప్రభుత్వ కేటాయింపుల ప్రకారం సంబంధిత మిల్లులకు సమయానుకూలంగా తరలించాలని తెలిపారు.జిల్లాలో ధాన్యం కొనుగోలు ప్రక్రియను మరింత వేగవంతం చేసి, రైతులు తమ ధాన్యాన్ని విక్రయించిన అనంతరం వారికి రావలసిన నగదు చెల్లింపులను ఆలస్యం లేకుండా త్వరితగతిన పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. రైతులు కొనుగోలు కేంద్రాలకు వచ్చినప్పుడు ఎటువంటి అసౌకర్యాలు ఎదురుకాకుండా అన్ని సౌకర్యాలు కల్పించి, సజావుగా కొనుగోలు ప్రక్రియ కొనసాగించేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.కొనుగోలు కేంద్రాలలో ఎటువంటి అంతరాయాలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని, ముఖ్యంగా హమాలి సమస్యలు లేదా రవాణా సమస్యలు ఏర్పడకుండా సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని పారదర్శకంగా మరియు సమర్థవంతంగా ధాన్యం కొనుగోలు కార్యక్రమాన్ని నిర్వహించాలని జిల్లా కలెక్టర్ సూచించారు.

కొనుగోలు కేంద్రాల్లో హమాలి, రవాణా లోడింగ్ అన్లోడింగ్ ప్రక్రియ వంటి ఇబ్బందులకు తావులేకుండా ఒకటి బంతి చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు. రైతులు కూడా మధ్యవర్తులను నమ్మకుండా నేరుగా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలకే ధాన్యం తీసుకురావాలని సూచించారు.

జిల్లా కలెక్టర్ వెంట అదనపు కలెక్టర్ అమరేందర్ మార్క్ ఫెడ్ డి ఎం తమీన , వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రమణారావు, నాగర్ కర్నూల్ ఆర్ డి ఓ సురేష్ బాబు ఇతర శాఖల అధికారులు తదితరులు ఉన్నారు.

## బడి బయట పిల్లలు లేని

# జిల్లాగా మార్చుదాం

బలోపేతానికి అందరం బాధ్యత తీసుకుందాం అని ఆమె సూచించారు. జిల్లాలోని ఏ ఒక్క గ్రామంలో కూడా బడి బయట పిల్లలు ఉండరాదని, బడి ఈడు పిల్లలు బడిలోనే ఉండాలని ఆమె స్పష్టం చేశారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ లో భాగంగా జిల్లా విద్యా శాఖ ఆధ్వర్యంలో బుధవారం జిల్లా కేంద్రానికి సమీపంలోని సింగారం మలుపు దారి వద్ద గల వృత్తి నైపుణ్య శిక్షణా కేంద్రంలో నారాయణ పేట నియోజక వర్గం, కొడంగల్ పార్ట్ సర్పంచులు/ కౌన్సిలర్ల కు విద్యా శాఖ లో అమలవుతున్న కార్యక్రమాలపై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. జిల్లా కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి ఈ కార్యక్రమానికి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ లో భాగంగా ఈ నెల 11 నుంచి విద్యా శాఖా వారోత్సవాలు నిర్వహిస్తోందని, ఇటీవలే ఎల్. బీ స్టేడియంలో రాష్ట్ర విద్యాశాఖ ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగిన విషయాన్ని గుర్తు చేశారు. ఆ వారోత్సవాలలో భాగంగానే మన జిల్లాలో సర్పంచులు, కౌన్సిలర్ల కు అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరుగుతోందని ఆమె తెలిపారు. గ్రామ స్థాయిలో సర్పంచుల భూమిక ముఖ్యమని, కొత్తగా బాధ్యతలు చేపట్టిన సర్పంచులకు తమ తమ గ్రామానికి ఏం అవసరమో ఈపాటికే తెలిసి ఉంటుందన్నారు. గ్రామాలలో ఉన్న సమస్యలు, ప్రభుత్వం నుంచి వస్తున్న నిధుల గురించి కూడా కొంత అవగాహన వచ్చి ఉంటుందని చెప్పారు. ముఖ్యంగా గ్రామలలో ఉన్న ప్రభుత్వ పాఠశాలలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా ఏం పథకాలు వస్తున్నాయి?. అవి ఎంత వరకు అమలు అవుతున్నాయని?. అందులో మన పాత్ర ఏమిటని సర్పంచులు/ కౌన్సిలర్లు అవగాహన కలిగి ఉండాలని ఆమె సూచించారు. కార్యక్రమానికి వచ్చిన సర్పంచులలో ఎక్కువ మంది మహిళలు ఉండటం ఒక మహిళగా తనకు ఎంతో ఆనందం గా ఉందని అందరికీ అభినందనలు తెలిపారు. గ్రామాల్లో పాఠశాలలను బాగు చేయాలంటే ప్రతీ విద్యార్థి పాఠశాలలోనే ఉండాలన్నారు. అందుకు సర్పంచులు సహకారం ఎంతో అవసరం అన్నారు. జిల్లాలోని ప్రతీ గ్రామంలో ఉండే బడి ఈడు పిల్లలందరూ బడిలోనే ఉండాలని, డ్రాప్ అవుట్ జీరో ఉండాలని, అందుకు సర్పంచులు ప్రత్యేక చొరవ తీసుకోవాలని ఆమె కోరారు. ప్రస్తుతం జిల్లాలో డ్రాప్ డ్రాప్ అవుట్ పిల్లల జాబితా, ఎంత మంది పిల్లలు బడికి వెళ్తున్నారు.? ఇంకా ఎంత మంది పాఠశాలకు వెళ్లకుండా ఉన్నారనే వివరాలను నివేదికను విద్యా శాఖ తయారు చేస్తోందని ఆమె చెప్పారు. ఏ గ్రామంలో అయితే వంద శాతం పిల్లలు బడికి వెళ్తున్నారో ! వారిని బడికి వెళ్లేలా చేసిన సర్పంచులకు ప్రభుత్వం ద్వారా సన్మానం చేయించేందుకు కృషి చేస్తానని కలెక్టర్ హామీ ఇచ్చారు. అంతేకాకుండా సర్పంచులు తమ గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలను ప్రతీ వారం సందర్శించాలని, పాఠశాలల్లోనే విద్యార్థులతో కలిసి భోజనం కూడా చేయాలని అలా చేస్తే వంట ఏజెన్సీ నిర్వాహకులకు కొంత భయం ఉంటుందని, నాణ్యతా ప్రమాణాలు పాటించడం జరుగుతుందనీ ఆమె తెలిపారు. అన్నీ అధికారులే చేయలేరని, కేంద్ర, రాష్ట్ర, స్థానిక సంస్థలు త్రీ లేయర్స్ ఉంటాయని, గ్రామ స్థాయిలో సర్పంచుల పాత్ర ఎంతో కీలకమని ఆమె తెలిపారు. గ్రామాలలో అంగన్ వాడిలు, పాఠశాలల సమస్యల పట్ల తన వద్దకు వస్తే అవసరమైనవన్ని సమకూర్చేందుకు సిద్ధంగా ఉంటామని కలెక్టర్ భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యా శాఖ అధికారి గోవింద రాజులు, స్థానిక పురపాలిక చైర్ పర్సన్ కొండా శ్వేతా సత్య యాదవ్, వైస్ చైర్ పర్సన్ మంజుల, మద్దూరు పుర చైర్ పర్సన్ సరస్వతి, ఆయా మండలాల ఎంఈవో లు, గ్రామాల సర్పంచులు, సెక్టోరియల్ అధికారులు రాజేందర్ కుమార్, నాగార్జున రెడ్డి, విద్యా సాగర్, డీపీ ఆర్వో రషీద్, తపస్ నాయకులు షేర్ కృష్ణా రెడ్డి, నర్సింహ, పి ఆర్ టి యు జిల్లా అధ్యక్షుడు యాదగిరి జనార్దన్ రెడ్డి, విద్యా శాఖ కార్యాలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## జనగణన హౌస్ లిస్టింగ్‌లో ప్రతి ఇల్లు

# నమోదు కావాలి



సరైన మ్యాప్ తయారు చేయాలని ఆదేశించారు.ఇంటి నంబర్లను సక్రమంగా గుర్తించడంతో పాటు,ఒకే కప్పు కింద ఉన్న ఇళ్లకు కూడా స్పష్టమైన నంబరింగ్ విధానం పాటించాలని సూచించారు.ఎన్యుమరేటర్లు తమ బ్లాక్ పరిధిలో ఇప్పటివరకు ఎన్ని ఇళ్లు కవర్ చేశారో,జనాభా అంచనాలు,మ్యాపింగ్ పురోగతి వంటి వివరాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు.సూపర్వైజర్లు,చార్జ్ అధికారులు క్రమం తప్పకుండా క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ ఎన్యుమరేటర్లకు అవసరమైన మార్గదర్శకాలు అందించాలని ఆదేశించారు.గ్రామ పంచాయతీ సిబ్బందిపై పూర్తిగా ఆధారపడకుండా ప్రతి ఎన్యుమరేటర్ తమ పరిధిపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని సూచించారు.మ్యాప్ పూర్తయిన వెంటనే దాన్ని పరిశీలించి భద్రపరచాలని,ప్రతి ఇంటికి మార్కర్‌తో నంబర్లు స్పష్టంగా వేయాలని కలెక్టర్ ఆదేశించారు.గణన ప్రక్రియను అత్యంత బాధ్యతతో నిర్వహించి ఖచ్చితమైన గణాంకాలు నమోదు చేయాలని,ఫీల్డ్ స్థాయిలో ఎలాంటి నిర్లక్ష్యం సహించబోమని హెచ్చరించారు.ఈ పర్యటనలో తహసిల్దార్ నందిని, సూపర్వైజర్లు తదితరులు పాల్గొన్నారు.

## బక్రీద్ సందర్భంగా కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేయాలి



గద్వాల మే 13(ప్రజా జ్యోతి ప్రతినిధి):బక్రీద్ పండుగ సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా శాంతిభద్రతలు,ట్రాఫిక్ నియంత్రణ,సామాజిక సామరస్య వాతావరణం నెలకొల్పేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని తెలంగాణ రాష్ట్ర డీజీపీ సి.వి.ఆనంద్ ఆదేశించారు.బుధవారం జిల్లా స్థాయి పోలీసు అధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో డీజీపీ మాట్లాడారు.ఈ సమావేశంలో రాష్ట్రంలోని అన్ని కమిషనరేట్లు, జిల్లాల నుంచి ఎస్పీలు,పోలీసు కమిషనర్లు,అదనపు డీసీపీలు,ఏసీపీలు,సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.జోగుళాంబ గద్వాల జిల్లా నుంచి జిల్లా ఎస్పీ టి. శ్రీనివాసరావు పాల్గొని జిల్లాలో చేపట్టిన భద్రతా చర్యలను వివరించారు.ఈ సందర్భంగా డీజీపీ మాట్లాడుతూ,ఈద్గాలు,మసీదులు,ప్రార్థనా స్థలాలు,మార్కెట్ ప్రాంతాలు,ప్రధాన రహదారులు,జనసంచారం అధికంగా ఉండే ప్రాంతాల్లో కట్టుదిట్టమైన బందోబస్తు ఏర్పాటు చేయాలని సూచించారు.సామాజిక మాధ్యమాల ద్వారా వదంతులు,అసత్య ప్రచారాలు,రెచ్చగొట్టే పోస్టులు వ్యాప్తి చెందకుండా సైబర్ మానిటరింగ్‌ను మరింత బలోపేతం చేయాలని స్పష్టం చేశారు.అనుమానాస్పద సమాచారం గమనించిన వెంటనే స్థానిక పోలీసులకు తెలియజేయాలని ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. మత పెద్దలు,ప్రజాప్రతినిధులు,శాంతి కమిటీ సభ్యులతో ముందస్తు సమావేశాలు నిర్వహించి సామరస్య వాతావరణం నెలకొల్పాలని,సున్నిత ప్రాంతాల్లో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని తెలిపారు.డ్రోన్ కెమెరాలు,సీసీ కెమెరాల పర్యవేక్షణతో భద్రతా చర్యలను మరింత కట్టుదిట్టం చేయాలని ఆదేశించారు.అన్ని చెక్‌పోస్టుల్లో 24 గంటలు పోలీసు సిబ్బంది అప్రమత్తంగా విధులు నిర్వహించాలని,పోలీసు,రెవెన్యూ,మున్సిపల్ శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.పండుగ విధుల్లో పాల్గొనే సిబ్బంది ప్రజలతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని,ఎక్కడైనా చిన్న ఘటన జరిగినా వెంటనే స్పందించి పరిస్థితిని అదుపులోకి తీసుకురావాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ కె.శంకర్,డీఎస్పీ వై.మొగిలయ్య,అలంపూర్-- గద్వాల సర్కిల్ అధికారులు,రెవెన్యూ,వెటర్నరీ,మున్సిపల్ శాఖల అధికారులు,తదితరులు పాల్గొన్నారు.

# పారిశుద్ధ్యానికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలి





## జిల్లా కలెక్టర్ సీ హెచ్ ప్రియాంక

**నారాయణపేట ప్రతినిధి మే 13 ప్రజా జ్యోతి**

పారిశుద్ధ్యం, తాగునీటికి అధిక ప్రాధాన్యత ఇచ్చి పుర వార్డులను పరిశుభ్రంగా ఉంచాలని జిల్లా కలెక్టర్ సీ హెచ్ ప్రియాంక అన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ లో భాగంగా బుధవారం ఉదయం కలెక్టర్ జిల్లా కేంద్ర మున్సిపాలిటీ లోని ఆరో వార్డులో కొనసాగుతున్న పారిశుధ్య స్పెషల్ డ్రైవ్ ను చైర్ పర్సన్ కొండా శ్వేతా సత్య యాదవ్ తో కలిసి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా వార్డు పరిధిలో గల బీసీ కాలనీ లో పర్యటించిన కలెక్టర్ అక్కడి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వార్డు వాసుల సమస్యలపై ఆమె సానుకూలంగా స్పందించారు. తమకు మరుగుదొడ్లు లేవని పలువురు మహిళలు కలెక్టర్ కు విన్నవించడంతో స్పందించిన ఆమె స్వచ్ఛ భరత్ మిషన్ ద్వారా మరుగుదొడ్ల నిర్మాణానికి ప్రతిపాదనలు పంపించి అనుమతి తీసుకోవాలని మున్సిపల్ అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్ పర్సన్ మంజుల, కమిషనర్ శంకర్, ఇంజినీర్, మున్సిపాలిటీ కి చెందిన జవాన్లు, నీటి సరఫరా, ఎలక్ట్రికల్, ఇంజనీరింగ్ విభాగాల అధికారులు,సిబ్బంది పాల్గొన్నారు.

### పేట యార్డులో కొనుగోలు కేంద్రాన్ని తనిఖీ చేసిన కలెక్టర్

నారాయణపేట జిల్లా కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో మెప్మా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాన్ని బుధవారం జిల్లా కలెక్టర్ సీ హెచ్ ప్రియాంక ఆకస్మికంగా తనిఖీ చేశారు. ధ్యానం కొనుగోళ్ల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ధ్యానం తేమ శాతం పరిశీలించారు. మంగళ వారం వరకు కొనుగోలు చేసిన ధాన్యం బస్తాలను మిల్లలకు తరలించడం జరిగిందని, ఇప్పటి వరకు 90 మంది రైతులతో కొనుగోలు చేసిన ధాన్యానికి గాను 74 మంది రైతులకు వారి వారి ఖాతాల్లో డబ్బు జమ చేయడం జరిగిందని, మిగతా రైతులకు కూడా ట్యాబ్ ఎంట్రీ చేసి ధాన్యం డబ్బులను వారి ఖాతాల్లో వేస్తామని నిర్వాహకులు కలెక్టర్ కు తెలిపారు. ఈ కార్యక్రమంలో సివిల్ సప్లై మేనేజర్ సైదులు, మెప్మా సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.





## పూడూరులో పోక్సో చట్టంపై న్యాయ అవగాహన కార్యక్రమం

**-సురక్షిత బాల్యం సురక్షిత భవిష్యత్ పేరుతో జాగృతి పథకం నిర్వహణ**





**గద్వాల (ప్రజా జ్యోతి) మే 13:**

జోగులాంబ గద్వాల జిల్లా గద్వాల మండలంలోని పూడూర్ గ్రామ పంచాయతీ కార్యాలయ ప్రాంగణంలో బుధవారం ఉదయం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో జాగృతి పథకం--2025 కింద సురక్షిత బాల్యం సురక్షిత భవిష్యత్ పేరుతో పోక్సో చట్టంపై న్యాయ అవగాహన కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. చిన్నారుల రక్షణ,వారి హక్కులు,పోక్సో చట్టంలోని నిబంధనలు మరియు పిల్లలపై జరిగే లైంగిక దాడుల నివారణపై గ్రామ ప్రజలు, విద్యార్థులు,తల్లిదండ్రుల్లో అవగాహన కల్పించడమే కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యమని నిర్వాహకులు తెలిపారు.

ఈ కార్యక్రమంలో లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్స్ వి.రాజేందర్,బి.శ్రీనివాసులు ముఖ్య వక్తలుగా పాల్గొని పోక్సో చట్టంలోని ముఖ్య అంశాలను వివరించారు. చిన్నారుల రక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు,చట్టపరమైన చర్యలు,పిల్లలపై జరిగే వేధింపులను వెంటనే సంబంధిత అధికారులకు తెలియజేయాల్సిన అవసరాన్ని వివరించారు. విద్యార్థులు భయపడకుండా తమ సమస్యలను ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు లేదా అధికారులతో పంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బుజ్జన్న,పంచాయతీ కార్యదర్శి ఆంజనేయులు,పాఠశాల ప్రధానోపాధ్యాయులు రమణ,గ్రామ ప్రజలు, విద్యార్థులు,ఉపాధ్యాయులు పాల్గొన్నారు.గ్రామ ప్రజలు,విద్యార్థులు చట్ట అవగాహనపై ఆసక్తిగా పాల్గొని తమ సందేహాలను నివృత్తి చేసుకున్నారు.

## బండి భగీరథ్ ను అరెస్టు చేయాలి

**- కె. కాశీనాథ్ సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ పార్టీ జిల్లా నాయకులు**
**- జయ పి ఓ డబ్ల్యు రాష్ట్ర సహాయ కార్యదర్శి డిమాండ్**





నారాయణపేట ప్రతినిధి మే 13 ప్రజా జ్యోతి

బేటి పడావో -బేటి బచావో అని నిత్యం మాట్లాడే బండి సంజయ్ కేంద్ర హోం శాఖ మంత్రి ఇప్పుడు దేశ ప్రజలకు సమాధానం చెప్పాల్సిన అవసరం వచ్చింది. బండి సంజయ్ కొడుకు బండి భగీరథ 17 సంవత్సరాల అమ్మాయిని వేధించడం, ఇబ్బందులకు గురి చేయడం, బలవంతంగా అత్యాచారానికి పాల్పడడం జరిగిందని బాధితులు పోలీసుల చుట్టూ తిరుగుతున్నారు. పోక్సో కేసు నమోదు చేశారు. మూడు రోజులు అవుతుంది. నిందితున్ని అరెస్టు చేయలేదు. నిందితుని తరఫున కేంద్ర హోం శాఖ మంత్రి బండి సంజయ్ ఉండటంతో, స్వయాన బండి సంజయ్ కొడుకు కావడంతో నిందితుని అరెస్టు జాప్యం జరుగుతున్నది వాస్తవం. బండి సంజయ్ కొడుకు బండి భగీరథ ఈ రకమైన అత్యాచారానికి పాల్పడడం మంచి పద్ధతి కాదు దీనిని సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ పార్టీగా ,ప్రగశీల మహిళా సంఘం (పి ఓ డబ్ల్యూ) తీవ్రంగా ఖండిస్తున్నాను. బిజెపి పార్టీ బాధ్యతగా బండి సంజయ్ తో దేశ ప్రజలకు క్షమాపణ చెప్పియాలి. బండి సంజయ్ నోటిని కట్టడి చేయాలి. మంత్రి పదవి నుండి బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేస్తున్నాం. దేశవ్యాప్తంగా రాష్ట్రవ్యాప్తంగా మహిళలపై అనేక రకాల వేధింపులు అత్యాచారాలు బెదిరింపులు జరుగుతున్న దాంట్లో ప్రజాప్రతితులు ఉన్న పోలీసులు పాలకవర్గం పట్టించుకోవడం లేదు. దీంతో కేసులు నీరుగారి పోతున్నాయి. బాధితులకు న్యాయం జరగటం లేదు. వెంటనే బాధితులకు న్యాయం చేయాలి. బండి భగీరథ్ అరెస్టు చేయాలి. బండి సంజయ్ మంత్రి పదవిని తొలగించాలి. బిజెపి పార్టీ నుండి సస్పెండ్ చేయాలనీ డిమాండ్ చేస్తున్నాము.

# బండి భగీరధ్‌ను వెంటనే అరెస్టు చేయాలి

**-నైతిక బాధ్యత వహిస్తూ బండి సంజయ్**
**ఎంపీ పదవికి రాజీనామా చేయాలి**
**-పీవైఎల్ జిల్లా అధ్యక్షుడు బీరెల్లి దానయ్య**

**గద్వాల (ప్రజా జ్యోతి) మే 13:**

జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పీవైఎల్ జిల్లా అధ్యక్షుడు బీరెల్లి దానయ్య కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథపై నమోదైన పోక్సో కేసుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోక్సో కేసు నమోదై ఇంతకాలం గడిచినా బండి భగీరథను పోలీసులు అరెస్టు చేయకపోవడం అనుమానాలకు తావిస్తోందన్నారు.ఇదే కేసులో సామాన్య వ్యక్తి ఉంటే పోలీసులు వెంటనే అరెస్టు చేసేవారని,కానీ కేంద్ర మంత్రి కుమారుడు కావడంతో పోలీసులు నిర్లక్ష్యంగావ్యవహరిస్తున్నట్లు కనిపిస్తోందని ఆరోపించారు.బండి భగీరథపై గతంలో కూడా విద్యాసంస్థల్లో ర్యాగింగ్,విద్యార్థులపై దాడులు,దౌర్జన్యాలకు పాల్పడ్డారనే ఆరోపణలు ఉన్నాయని పేర్కొన్నారు. బాలికను వేధించి బలవంతంగా మద్యం తాగించి అత్యాచారం చేసిన కేసులో పోలీసులు అనుసరిస్తున్న తీరు సరైంది కాదన్నారు.

దేశం కోసం,ధర్మం కోసం మాట్లాడే బీజేపీ నాయకులు ఈ ఘటనపై ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు.ప్రజా ప్రతినిధులకు ఒక న్యాయం,పేదలకు



మరో న్యాయమా అని నిలదీశారు.దేశంలో చట్టబద్ధ,రాజ్యాంగబద్ధ సంస్థలను బీజేపీ నిర్వీర్యం చేస్తోందని ఆరోపించారు.ఘటనపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని రాజకీయ పార్టీలు,ప్రజాసంఘాలు డిమాండ్ చేస్తున్నప్పటికీ, బీజేపీ నాయకులు విషయాన్ని పక్కదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు.కేంద్ర మంత్రి కుమారుడు తప్పు చేయనప్పుడు బాధిత కుటుంబానికి డబ్బులు ఎందుకు చెల్లించారో బీజేపీ నాయకులు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.ఇటువంటి ఘటనలు ఇతర రాష్ట్రాల్లో జరిగితే రోడ్డెక్కే బీజేపీ మహిళా సంఘాల నాయకులు ఇప్పుడు ఎందుకు మౌనం వహిస్తున్నారని ప్రశ్నించారు.రాష్ట్ర ప్రభుత్వం కూడా ఘటనపై త్వరితగతిన విచారణ చేపట్టి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని,లేనిపక్షంలో ప్రజా ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో జమ్మిచేడు కార్తీక్,కోళ్ల అంజి,దొరబాబు, నాగరాజ్ తదితరులు పాల్గొన్నారు.

# బాల్యవివాహాల నిర్మూలన,ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధిలో ప్రజాప్రతినిధుల పాత్ర కీలకం

## కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్





**గద్వాల మే 13(ప్రజా జ్యోతి ప్రతినిధి):**
ప్రభుత్వ విద్యాసంస్థలను బలోపేతం చేయడంతో పాటు బాల్యవివాహాలను నిర్మూలించేందుకు సర్పంచులు,కౌన్సిలర్లు కీలక పాత్ర పోషించాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ పేర్కొన్నారు.ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల షెడ్యూల్‌లో భాగంగా నిర్వహిస్తున్న విద్యా వారోత్సవాల సందర్భంగా బుధవారం ఐడీఓసీ సమావేశ మందిరంలో స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధులకు పాఠశాల విద్యా కార్యక్రమాలపై ఒకరోజు వర్క్‌షాప్ నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కలెక్టర్ మాట్లాడారు.ఏ గ్రామంలో బాల్యవివాహం జరిగినా సంబంధిత సర్పంచ్‌లకు తప్పకుండా సమాచారం ఉంటుందని, అలాంటి వివాహాలకు సహకరించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు పాఠశాలలు,అంగన్‌వాడీ కేంద్రాల పనితీరుపై నిరంతరం పర్యవేక్షణ చేయాల్సిన బాధ్యత ఉందన్నారు.ప్రభుత్వ విద్యాసంస్థల్లో విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తున్నామని,వచ్చే విద్యా సంవత్సరం నుంచి ఉదయం అల్పాహారం కూడా అందించనున్నట్లు తెలిపారు. జిల్లాలోని పాఠశాలల్లో పూర్తిస్థాయిలో మరుగుదొడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేసినట్లు చెప్పారు.అమ్మ ఆదర్శ పాఠశాలల్లో మరమ్మత్తులు చేపట్టడంతో పాటు,"మన ఊరు--మన బడి"కార్యక్రమంలో మంజూరై పెండింగ్‌లో ఉన్న అదనపు తరగతి గదుల నిర్మాణానికి కృషి చేస్తున్నామని వివరించారు.విద్యార్థులకు ప్రభుత్వం ప్రత్యేక కిట్లు కూడా అందించనున్నట్లు తెలిపారు.మెరుగైన పనితీరు కనబరిచే సర్పంచ్‌లకు ప్రతి మండలం నుంచి ఐదుగురికి చొప్పున ఆగస్టు 15న అవార్డులు అందజేయనున్నట్లు కలెక్టర్ ప్రకటించారు.అనంతరం పదో తరగతి ఫలితాల్లో ప్రతిభ కనబరిచిన వివిధ పాఠశాలల విద్యార్థులకు కలెక్టర్ సంబంధిత అధికారులతో కలిసి బహుమతులు, ప్రశంసా పత్రాలు అందజేశారు.ఈ కార్యక్రమంలో డీఈవో విజయలక్ష్మి,ఇన్‌చార్జి డీవైఎస్‌వో రామలింగేశ్వర గౌడ్,డీపీవో శ్రీకాంత్,ఇతర అధికారులు పాల్గొన్నారు.

# దివ్యాంగుల సంక్షేమానికి ప్రభుత్వం అండగా ఉంటుంది

## కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్





**గద్వాల మే 13(ప్రజా జ్యోతి ప్రతినిధి):**
దివ్యాంగులకు విద్య,ఉద్యోగాల్లో రిజర్వేషన్లు కల్పించడమే కాకుండా వారి సంక్షేమానికి ప్రభుత్వం అన్ని విధాలుగా సహకరిస్తుందని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ తెలిపారు.ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల షెడ్యూల్‌లో భాగంగా సమగ్ర శిక్ష, ఆలిమ్కో సంస్థ ఆధ్వర్యంలో బుధవారం గద్వాల ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహించిన దివ్యాంగులకు సహాయ ఉపకరణాల పంపిణీ శిబిరంలో కలెక్టర్ పాల్గొని మాట్లాడారు.దివ్యాంగులు తమ పనులు తాము చేసుకునేందుకు సహాయ ఉపకరణాలు ఎంతో దోహదపడతాయని అన్నారు. ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు తల్లిదండ్రులు పూర్తి సహకారం అందించి,మంచి విద్య అందిస్తే దివ్యాంగుల కోటాలో త్వరగా ఉద్యోగ అవకాశాలు పొందే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు.దివ్యాంగులకు పంపిణీ చేసిన ఉపకరణాల వినియోగంపై సంబంధిత అధికారులు సమగ్ర అవగాహన కల్పించాలని సూచించారు.ఈ సందర్భంగా ప్రత్యేక అవసరాలు గల పిల్లల తల్లిదండ్రులతో మాట్లాడిన కలెక్టర్ వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.అనంతరం పలువురు చిన్నారులకు కలెక్టర్ చేతుల మీదుగా సహాయ ఉపకరణాలను పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో డీఈఓ విజయలక్ష్మి, ఇన్‌చార్జి డీవైఎస్‌వో రామలింగేశ్వర్ గౌడ్,సెక్టోరియల్ అధికారి కర్రెప్ప,ఆలిమ్కో సంస్థ ప్రతినిధులు సోనీ కుమారి,శోభిత్ ద్వివేది తదితరులు పాల్గొన్నారు.

# గ్రామదేవతల ఆశీస్సులతో ప్రజలు సుఖశాంతులతో ఉండాలి





## ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి

**గట్టు మే 13(ప్రజా జ్యోతి):**
గద్వాల నియోజకవర్గం గట్టు మండల పరిధిలోని గొర్లఖాన్ దొడ్డి గ్రామంలో గ్రామదేవతలైన మారెమ్మ అవ్వ,కర్రెమ్మ అవ్వ దేవర సందర్భంగా ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారి ఆశీస్సులు పొందారు.అనంతరం చమన్ ఖాన్ దొడ్డి గ్రామంలో ఇంజమ్మ దేవర సందర్భంగా దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్‌లు, నాయకులు ఎమ్మెల్యేకు శాలువా కప్పి పుష్పగుచ్ఛం అందజేసి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ,గ్రామ దేవతలను భక్తిశ్రద్ధలతో పూజించడం వల్ల గ్రామంపై ఎలాంటి చెడు ప్రభావాలు,నరదృష్టి పడకుండా అమ్మవార్లు కాపాడుతారని అన్నారు.దేవర సందర్భంగా గ్రామంలో పండుగ వాతావరణం నెలకొనడం ఆనందదాయకమన్నారు.గ్రామదేవతల ఆశీస్సులతో గ్రామ ప్రజలు సుఖ సంతోషాలు, ఆయురారోగ్యాలు,అష్టైశ్వర్యాలతో నిండు నూరేళ్లు జీవించాలని అమ్మవారిని మనస్ఫూర్తిగా ప్రార్థించినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర వాల్మీకి కార్పొరేషన్ చైర్మన్ గట్టు తిమ్మప్ప,జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ జంబు రామన్ గౌడ్,మాజీ ఎంపీపీ విజయ్,సర్పంచ్‌లు షేకమ్మ ఆంజనేయులు,భీమయ్య,నాయకులు మైలగడ్డ చంద్రశేఖర్, రామకృష్ణ నాయుడు,వెంకటన్న గౌడ్,సిద్ధు,నారాయణ,తిమ్మప్ప,శేఖర్ గౌడ్,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు..

# సంక్షేమ ఫలాలు గ్రామ గ్రామాన చేరుతున్నాయి

- ఆనందోత్సాహాల మధ్య గృహప్రవేశ కార్యక్రమాలు
- లబ్ధిదారులకు నూతన వస్త్రాల అందించిన ఎమ్మెల్యే తూడి మేఘా రెడ్డి



**వనపర్తి, మే 13 (ప్రజాజ్యోతి):**
వనపర్తి నియోజకవర్గంలో ఇందిరమ్మ ఇండ్ల జాతర కొనసాగుతోంది. బుధవారం వనపర్తి పట్టణంలోని 12వ వార్డులో ఇందిరమ్మ ఇండ్లు నిర్మించుకున్న లబ్ధిదారుల గృహప్రవేశ కార్యక్రమాలకు వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి హాజరై నూతన వస్త్రాలను అందజేసి అభినందించారు. అరుణ చింతకాయల మన్నెం, చామంతి రవి, నక్క వెంకటయ్య--కుసుమ, ఆగారపు శ్యాంకుమార్--జ్యోతి, వడ్డగేరి అలివేల గృహప్రవేశ కార్యక్రమాల్లో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రతి నిరుపేదకు సొంత ఇల్లు నిర్మించుకునేందుకు రూ.5 లక్షల ఆర్థిక సహాయం అందజేస్తోందన్నారు. గత ప్రభుత్వాలు కేవలం హామీలకే పరిమితమయ్యాయని, ప్రజల సంక్షేమానికి పెద్దగా చర్యలు చేపట్టలేదని విమర్శించారు. ఇందిరమ్మ రాజ్యంలో గ్రామ గ్రామాన నిరుపేదలకు ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందుతున్నాయని, కాంగ్రెస్ ప్రభుత్వంతోనే ప్రజా సంక్షేమం సాధ్యమవుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్ నక్క రాణి రాజు, మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# పోక్సో కేసుపై బీజేపీ మౌనం ఎందుకు..?

**-నీట్ పేపర్ లీకేజీలతో యువత భవిష్యత్తును నాశనం చేసిన బిజెపి ప్రభుత్వం.**

**-కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు ఎండి సలీం**



**నారాయణపేట, ప్రతినిధి మే 13 ప్రజా జ్యోతి**
దేశానికి నీతి, న్యాయం,సంస్కారం గురించి ఉపన్యాసాలు ఇచ్చే బీజేపీ నాయకులు. బిజెపి పార్టీ కి చెందిన కేంద్ర మంత్రి బండి. సంజయ్ కుమారుడు బండి.భగీరథ్ మైనర్ బాలిక పై లైంగిక దాడి చేసిన ఘటనలపై ఎందుకు మౌనం వహిస్తున్నారని కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు ఎండి సలీం బుధవారం ఒక ప్రకటనలో ప్రశ్నించారు.కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ్‌పై నమోదైన పోక్సో కేసు చాలా తీవ్రమైన అంశమని,ఈ కేసుపై బీజేపీ నాయకులు ప్రజలకు సమాధానం చెప్పాల్సిన బాధ్యత ఉందన్నారు. సామాన్య ప్రజలపై ఆరోపణలు వస్తే మీడియా ముందుకు వచ్చి హడావిడి చేసే వారు,ఇప్పుడు మాత్రం నోరు మెదపకపోవడం వారి ద్వంద్వ రాజకీయాలకు నిదర్శనమని మండిపడ్డారు."బేటీ బచావో" అని నినాదాలు ఇచ్చిన బీజేపీ... ఇప్పుడు బాలల రక్షణకు సంబంధించిన కేసులో ఎందుకు మౌనం పాటిస్తోంది..? చట్టం ముందు అందరూ సమానమే అయితే పూర్తి స్థాయి పారదర్శక విచారణ జరిపించాలి" అని డిమాండ్ చేశారు.మరోవైపు దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన నీట్ పేపర్ లీకేజీ ఘటనతో లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తు అంధకారంలోకి వెళ్లిందన్నారు.పగలు రాత్రి కష్టపడి చదివిన విద్యార్థుల ఆశలతో బీజేపీ ప్రభుత్వం ఆటలాడిందని, దేశ విద్యా వ్యవస్థను పూర్తిగా దెబ్బతీసిందని విమర్శించారు.
ఎపర్ లీకేజీలు, నిరుద్యోగం, యువతలో నిరాశ, మహిళల భద్రతలో వైఫల్యం --- ఇవే బీజేపీ పాలనకు అసలు గుర్తులని ఎండి సలీం ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశ ప్రజల దృష్టి మళ్లించేందుకు అబద్ధపు రాజకీయాలు చేస్తూ అసలు సమస్యల నుంచి పారిపోవడం ఇక కుదరదన్నారు.బండి భగీరథ్‌పై నమోదైన పోక్సో కేసులో రాజకీయ ఒత్తిళ్లు లేకుండా నిష్పక్షపాత విచారణ జరిపించాలని,అలాగే నీట్ పేపర్ లీకేజీ ఘటనలో బాధ్యులపై కఠిన చర్యలు తీసుకొని దేశ యువతకు కేంద్ర ప్రభుత్వం క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

# రైతు సంఘం ( ఏఐయుకేఎస్) జాతీయ సహాయ కార్యదర్శిగా బి. రాము ఎన్నిక





**నారాయణపేట ప్రతినిధి మే 13 ప్రజా జ్యోతి**

అఖిల భారత ఐక్య రైతు సంఘం (ఏ ఐ యూకే ఎస్ ) అఖిల భారత మొదటి మహాసభలు ఉమ్మడి ఖమ్మం జిల్లా ఇల్లందు పట్టణంలో 11,12,13 మే 2026 తేదీలలో జరిగాయి.దీంట్లో నారాయణపేట జిల్లా కోటకొండ గ్రామానికి చెందిన బి రాము అఖిల భారత సహాయ కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. బి. రాము గత 40 సంవత్సరాలుగా విద్యార్థి, రైతు,ప్రజా ఉద్యమాల్లో తనకంటూ ఒక ముద్ర వేసుకొని ఈ ప్రాంతంలో అనేక ప్రజా ఉద్యమ నాయకులుగా,కమ్యూనిస్టు నాయకులుగా కొనసాగుతున్నారు. కోటకొండ గ్రామంలో 1988 సంవత్సరంలో భగత్ సింగ్ యువజన సంఘం ఏర్పాటు చేసుకోవడంలో తన వంతు పాత్ర ఉన్నది.యువతను కూడగట్టడం చైతన్యం చేయడం జరిగింది. నారాయణపేట జూనియర్ కళాశాల ఎన్నికల్లో ప్రగతి శీల విద్యార్థి సంఘం తరపున పోటీ చేసి గెలుపొందారు.1989 సంవత్సరం నుండి పి డి ఎస్ యు గా పనిచేస్తు విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా తిరిగి ఉద్యమాలు నిర్మించారు. విద్యార్థులను సమీకరించి చైతన్యపరిచి ఉద్యమ బాట పట్టించారు. కోటకొండ పరిసర ప్రాంతాల్లో భూ రక్షిత , కౌలు రైతులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కై జరిగిన ఉద్యమంలో కీలక పాత్ర పోషించారు. రక్షితకౌలు రైతులకి భూములు అందే వరకు వారి వెన్నంటి ఉన్నారు. ఈ క్రమంలో రైతు సంఘం జిల్లా కార్యవర్గ సభ్యునిగా ఎన్నుకున్నారు.1995 సంవత్సరంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో కోటకొండ గ్రామానికి ఎంపీటీసీగా గెలుపొందారు.జిల్లా ఉపాధ్యక్షులుగా, జిల్లా ప్రధాన కార్యదర్శిగా ,రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా కొనసాగుతూ,2001 సంవత్సరంలో కోటకొండ గ్రామానికి సర్పంచ్ గా ఎన్నికయ్యారు. (2001 సంవత్సరం లో కోటకొండ గ్రామ ఎంపీటీసీగా కూడా భార్య జయలక్ష్మి గెలుపొందారు) ఉమ్మడి జిల్లాలో కమ్యూనిస్టు పార్టీ నాయకునిగా నారాయణపేట ప్రాంతంలో అనేక ఉద్యమాలకు నాయకత్వం వహించారు. తెలంగాణ ఉద్యమంలో క్రియాశీలాంగా పాల్గొన్నారు. తెలంగాణ ఉద్యమంలో జైలు జీవితాన్ని కూడా అనుభవించారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పడ్డ తర్వాత నూతన జిల్లాలు ఏర్పడితే నారాయణపేట జిల్లా కాకపోవడంతో జిల్లా ఉద్యమంలో కూడా తన వంతు పాత్ర పోషించారు. నారాయణపేట మండలం అతిపెద్ద గ్రామమైన కోటకొండను మండల కేంద్రంగా ఏర్పాటు చేయాలని జరిగిన ఉద్యమంలో ముఖ్య పాత్ర పోషించారు. ప్రస్తుతం కోటకొండ గ్రామానికి భార్య జయలక్ష్మిబి. రాము సర్పంచుగా కొనసాగుతున్నారు. కోటకొండ గ్రామ అభివృద్ధిలో కిలక పాత్ర పోషించారు.నారాయణపేట ప్రాంతానికి సాగునీరు, తాగునీరు కావాలని జాయమ్మ చెరువు ఎత్తిపోతల పథకం చేపట్టాలని, ఆ తర్వాత నారాయణపేట కొడంగల్ ఎత్తిపోతల పథకం చేపట్టాలని జలసాధన సమితి ఏర్పాటు చేసి దాంట్లో ముఖ్యమైన నాయకునిగా కొనసాగారు. నారాయణపేట కొడంగల్ ఎత్తిపోతల పథకం ( జి ఓ నం 69)సాధన కోసం జరిగిన పాదయాత్రలో 13 రోజులపాటు 300 కిలోమీటర్ల పాదయాత్ర చేశారు. అనేక పోలీస్ అక్రమ కేసులు, పోలీసు నిర్బంధాలను ఎదుర్కొన్నారు. ఇండ్లు లేని నిరుపేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని, ప్రభుత్వం నిర్మించి ఇవ్వాలని, నారాయణపేట టౌన్ లోని మైనారిటీ కాలనీ, చిట్టెం నర్సిరెడ్డి కాలనీ వాసులకు మద్దతుగా నిలబడ్డారు. నారాయణపేట జిల్లా ఏర్పాటు అయిన తర్వాత సిపిఐ (ఎంఎల్ ) మాస్ లైన్ పార్టీ జిల్లా కార్యదర్శి గా పనిచేస్తునే, అఖిలభారత ఐక్య రైతు సంఘం ( ఏఐ యూకే ఎస్) రాష్ట్ర ఉపాధ్యక్షులుగా ఎన్నుకోబడ్డారు. దేశంలో రైతాంగ ఉద్యమాలు చేస్తున్న ఎస్ కె ఎంలో కూడా భాగస్వామిగా ఉంటూ రైతు ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టారు. కార్మికులకు రైతులకు, విద్యార్థులకు, పేద ప్రజలకు అండగా నిలబడ్డారు.తేదీ 25 26 ఆగస్టు 2025 తేదీలలో ఉమ్మడి మహబూబ్నగర్ జిల్లా కేంద్రంలో జరిగిన తెలంగాణ రాష్ట్ర ఐక్య రైతు సంఘం (ఏఐ యూకే ఎస్)మొదటి మహాసభలలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా బి. రామును రాష్ట్రవ్యాప్తంగా హాజరైన మహాసభ ప్రతినిధులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. తేది 11,12,13, మే 2026 న జరిగిన అఖిల భారత ఐక్య రైతు సంఘం ( ఏఐ యూకే ఎస్) అఖిలభారత మహాసభలలో రైతు సంఘం జాతీయ సహాయ కార్యదర్శిగా బి రాము ను ఎన్నుకున్నారు.కోటకొండ గ్రామానికి చెందిన బి రాము ఎన్నిక పట్ల హర్షం వ్యక్తం చేస్తూ, భవిష్యత్తులో రాష్ట్ర, దేశ వ్యాప్తంగా బలమైన ప్రజా ఉద్యమాలు నిర్మించాలని బలమైన రైతు సంఘంగా నిలవాలని ఆకాంక్షిస్తున్నాము.

# అలంపూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల నూతన ప్రిన్సిపాల్‌కు ఘన సన్మానం



**అలంపూర్ మే 13 (ప్రజా జ్యోతి):**

బండ్ల దేవేందర్ రెడ్డి అల్లంపూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల నూతన ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు స్వీకరించారు.ఈ సందర్భంగా కళాశాల అధ్యాపక బృందం ఆయనను శాలువా,పూలమాలతో ఘనంగా సన్మానించింది.ఇంతకుముందు ఆయన గద్వాల ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో వృక్షశాస్త్ర అధ్యాపకులుగా సేవలందించారు.ప్రమోషన్‌పై ప్రిన్సిపాల్‌గా అలంపూర్ కళాశాలకు రావడంపై తోటి అధ్యాపకులు హర్షం వ్యక్తం చేశారు.ఆయన అనుభవం కళాశాల అభివృద్ధికి దోహదపడుతుందని ఆకాంక్షించారు.ఈ సన్మాన కార్యక్రమంలోఅధ్యాపకులు రాముడు ఎన్.బి.రామచంద్రయ్య,ఆర్.రాముడు,డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్ (ఇంగ్లీష్) బి. శ్రీనివాసులు,బజ బాలస్వామి,షేక్షవలి,తిరుపతయ్య తదితరులు పాల్గొన్నారు.

# అనాథ చిన్నారుల సంరక్షణ, విద్యకు కేంద్ర ప్రభుత్వ సహాయం

- కలెక్టర్ ఖుష్బూ గుప్తా
- జాతీయ బాలల నిధికి దరఖాస్తు చేసుకోండి



**మహబూబ్‌నగర్, మే 13 ( ప్రజా జ్యోతి బ్యూరో ) :**

ఉగ్రవాద హింస, వామపక్ష తీవ్రవాదం, తిరుగుబాటు, సరిహద్దు కాల్పుల కారణంగా అనాథలు, నిరాశ్రయులైన చిన్నారుల సంక్షేమం కోసం కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న జాతీయ బాలల నిధికి అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా తెలిపారు. కేంద్ర ప్రభుత్వం నేషనల్ చైల్డ్ ఫండ్స్ స్కీమ్‌లో భాగంగా "కేర్ అండ్ ఎడ్యుకేషన్" అనే కొత్త విభాగాన్ని అమలు చేస్తున్నట్లు ఆమె పేర్కొన్నారు. ఈ పథకం ద్వారా అనాథలుగా మారిన చిన్నారుల చదువు మధ్యలో ఆగిపోకుండా చూడటం, వారి సంరక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వడం ప్రధాన ఉద్దేశ్యమని వివరించారు.అర్హత కలిగిన చిన్నారులకు 25 ఏళ్ల వయస్సు వచ్చే వరకు ప్రభుత్వ సహాయం అందించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. అర్హులైన పిల్లల సంరక్షకులు కలెక్టరేట్‌లోని రూమ్ నంబర్--36లో మహిళ, శిశు, దివ్యాంగుల మరియు వృద్ధుల సంక్షేమ శాఖ అధికారులను సంప్రదించాలని సూచించారు.

## ట్రాఫిక్ పోలీసులకు వాటర్ బాటిల్స్ పంపిణీ

**మహబూబ్‌నగర్, మే 13 ( ప్రజా జ్యోతి బ్యూరో ) :**

44, 45 డిగ్రీల మండుటెండల్లో విధులు నిర్వహిస్తూ ప్రజలకు సేవలు అందిస్తున్న మహబూబ్‌నగర్ ట్రాఫిక్ పోలీసులకు కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏ.పి. మిథున్ రెడ్డి వాటర్ బాటిల్స్ పంపిణీ చేశారు. తీవ్రమైన ఎండల మధ్య ట్రాఫిక్ నియంత్రణలో నిత్యం కష్టపడుతున్న పోలీసుల సేవలను అభినందిస్తూ వారికి తాగునీటి సదుపాయం కల్పించారు. ప్రజల భద్రత కోసం నిరంతరం పనిచేస్తున్న ట్రాఫిక్ పోలీసుల ఆరోగ్యం పట్ల కూడా సమాజం బాధ్యతగా వ్యవహరించాలని ఈ సందర్భంగా పేర్కొన్నారు. వేసవి తీవ్రత రోజురోజుకు పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలు కూడా అత్యవసర పనులు తప్ప బయటకు రాకుండా జాగ్రత్తలు పాటించాలని, తగినంత నీరు తీసుకుంటూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు.



# ఫేస్ ఆధార్ అథెంటికేషన్ విధానాన్ని రద్దు చేయాలి

## తెలంగాణ వ్యవసాయ వృత్తిదారుల యూనియన్






**గట్టు మే 13 (ప్రజా జ్యోతి):**

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కూలీలకు అమలు చేస్తున్న ఫేస్ ఆధార్ అథెంటికేషన్ విధానాన్ని వెంటనే రద్దు చేయాలని తెలంగాణ వ్యవసాయ వృత్తిదారుల యూనియన్ డిమాండ్ చేసింది.అలాగే విధి నిర్వహణ సమయంలో మృతి చెందిన ఉపాధి కూలీ కుటుంబానికి ప్రమాద బీమా కింద రూ.5 లక్షల ఆర్థిక సహాయం అందించాలని కోరింది.గట్టు మండలంలో ఉపాధి హామీ పనులను పరిశీలించిన సందర్భంగా యూనియన్ జిల్లా కోఆర్డినేటర్ జి.నర్సిములు మాట్లాడుతూ,కూలీలు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. ఫేస్ ఆధార్ అథెంటికేషన్ ఫోటో క్యాప్చర్ విధానం వల్ల కూలీలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు.ఇందువాసి గ్రామానికి చెందిన తోలు తిమ్మప్ప ఉపాధి హామీ పనుల్లో పాల్గొంటూ ఫేస్ ఆధార్ అథెంటికేషన్ ప్రక్రియ జరుగుతున్న సమయంలో అకస్మాత్తుగా కుప్పకూలి మృతి చెందినట్లు పేర్కొన్నారు.గంగంబాయి కుంట వద్ద మట్టి పనులు చేస్తున్న సమయంలో ఈ ఘటన చోటుచేసుకుందని తెలిపారు.ఎండ తీవ్రత 46 డిగ్రీల వరకు ఉండటంతో పాటు పని ప్రదేశాల్లో తాగునీరు,నీడ,ప్రథమ చికిత్స వంటి కనీస సౌకర్యాలు కూడా లేకపోవడం కూలీల ఆరోగ్యానికి ప్రమాదకరంగా మారిందన్నారు. నెట్‌వర్క్ అందుబాటులో ఉండే ప్రదేశాల్లో వందలాది మంది కూలీలతో రోజుకు రెండు సార్లు ఫేస్ ఆధార్ అథెంటికేషన్ చేయించడం వల్ల కూలీలు,ఫీల్డ్ అసిస్టెంట్లు కూడా అనారోగ్యానికి గురయ్యే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.మరణించిన తోలు తిమ్మప్ప కుటుంబానికి ప్రభుత్వం తక్షణమే ప్రమాద బీమా కింద రూ.5 లక్షల పరిహారం ప్రకటించాలని యూనియన్ డిమాండ్ చేసింది.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్, కుటుంబ సభ్యులు,ఎంపీడీవో చెన్నయ్య,గ్రామ పంచాయతీ కార్యదర్శి,ఏపీఓ స్వామి, టెక్నికల్ అసిస్టెంట్ తదితరులు పాల్గొన్నారు.

# నీట్ పేరుతో బహుజన బిడ్డల భవిష్యత్తు హత్య

### -కేంద్రంపై నడిగడ్డ ప్రజా సమితి మండిపాటు



**గద్వాల (ప్రజా జ్యోతి) మే 13:**
నీట్ పరీక్ష వ్యవస్థ బహుజన గ్రామీణ పేద విద్యార్థుల వైద్య విద్య కలలను ఛిద్రము చేస్తోందని నడిగడ్డ ప్రజా సమితి నాయకులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. గద్వాల జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ..కోచింగ్ మాఫియా,కార్పొరేట్ విద్యాసంస్థలకు అనుకూలంగా కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తోందని ఆరోపించారు.గ్రామీణ ప్రాంతాల బీసీ,ఎస్సీ,ఎస్టీ మైనారిటీ విద్యార్థులు ప్రభుత్వ కళాశాలల్లో చదువుతూ కష్టపడి పోటీ పడుతుంటే,కోట్ల రూపాయల కోచింగ్ తీసుకున్న కార్పొరేట్ విద్యార్థులతో సమానంగా పోటీ చేయడం అన్యాయమన్నారు.పేద బిడ్డలకు ఒక న్యాయం -- ధనికులకు మరో న్యాయమా ?అని ప్రశ్నించారు.120 ప్రశ్నలు లీక్ అయ్యే వరకు ఎన్.టి.ఏ కేంద్ర హోంశాఖ ఏం చేస్తున్నాయని ప్రశ్నించిన నాయకులు,పరీక్ష నిర్వహణలో కేంద్రం పూర్తిగావిఫలమైందన్నారు.నీట్ వల్ల తెలుగు రాష్ట్రాల విద్యార్థులకు ఎం.బి.బి.ఎస్ సీట్లు దూరమవుతున్నాయని, రాష్ట్ర సిలబస్‌కు అనుగుణంగా కాకుండా పరీక్షలు నిర్వహించడం ద్వారా బహుజన విద్యార్థులను వెనక్కి నెట్టుతున్నారని విమర్శించారు.పేపర్ లీక్‌కు బాధ్యులైన ఎన్ టి ఏ అధికారులను, మాఫియాను వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు.నీట్ విధానాన్ని వెంటనే రద్దు చేసి,2016కు ముందు ఉన్న విధంగా రాష్ట్రాలకే మెడికల్ అడ్మిషన్ల అధికారం ఇవ్వాలని కోరారు.లీక్ వల్ల నష్టపోయిన ప్రతి విద్యార్థికి రూ.5 లక్షల నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు.అలాగే కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ బహిరంగ క్షమాపణ చెప్పి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.
రెక్కాడితే గానీ డొక్కాడని కుటుంబాల పిల్లలు తల్లిదండ్రుల కలలు మోస్తూ నీట్ రాస్తే, కేంద్రం పేపర్ లీక్ ద్వారా వారి భవిష్యత్తును నాశనం చేసిందని అని ఆవేదన వ్యక్తం చేశారు.ఎస్సీ,ఎస్టీ, బీసీ విద్యార్థులు డాక్టర్లు కావడం ఢిల్లీ పాలకులకు ఇష్టం లేదని తీవ్ర విమర్శలు చేశారు.ఈ కార్యక్రమంలో బీఎస్పీ మాజీ జిల్లా ఉపాధ్యక్షులు బండారు ఎస్.రాజ్,స్వేరో మాజీ జిల్లా అధ్యక్షులు వేమన్న, పివైఎల్ జిల్లా అధ్యక్షులు దానయ్య,ప్రజాఫ్రంట్ ఉమ్మడి జిల్లా ఉపాధ్యక్షులు నాగన్న, మాజీ సర్పంచ్ ఆంజినేయులు, తుమ్మలచెరువు రాజు, దేవేందర్,సురేష్, గజేంద్ర,గోపాల్, తిమ్మప్ప,రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# జర్నలిస్టుల హక్కుల కోసం ఫెడరేషన్ నిరంతర కార్యాచరణ

### - 15న తమిళనాడుకు జర్నలిస్టుల విజ్ఞాన యాత్ర




**మహబూబ్‌నగర్, మే 13 ( ప్రజా జ్యోతి బ్యూరో ) :**
జర్నలిస్టుల హక్కుల పరిరక్షణ కోసం తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్ నిరంతర కార్యాచరణ కొనసాగిస్తోందని సంఘం రాష్ట్ర కో కన్వీనర్ డాక్టర్ బండి విజయ్ కుమార్ తెలిపారు. బుధవారం మహబూబ్‌నగర్ ప్రెస్ క్లబ్‌లో జిల్లా కార్యదర్శి మొలకలపల్లి గోపాల్ అధ్యక్షతన జరిగిన జిల్లా కమిటీ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. జిల్లా అక్రిడిటేషన్ కమిటీ ఆమోదంతో జర్నలిస్టులకు ఒకే విడతలో అక్రిడిటేషన్ కార్డుల జారీ ప్రక్రియ కొనసాగుతోందని తెలిపారు.మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి నిధులతో జర్నలిస్టుల సంక్షేమ కార్యక్రమాలు కొనసాగడం సంతోషకరమని పేర్కొన్నారు. ఈ విధానాన్ని రాష్ట్ర వ్యాప్తంగా ఇతర ఎమ్మెల్యేలు కూడా ఆదర్శంగా తీసుకోవాలని కోరారు. వర్కింగ్ జర్నలిస్టులకు హెల్త్ ఇన్సూరెన్స్ కల్పించే అంశంపై కూడా చర్చలు జరుగుతున్నాయని తెలిపారు.అర్హులైన జర్నలిస్టులకు ఇండ్లు, ఇండ్ల స్థలాలు ఇవ్వడానికి ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి, నగర డిప్యూటీ మేయర్ సురేందర్ రెడ్డి సానుకూలంగా స్పందిస్తున్నారని వెల్లడించారు. 25 సర్వే నంబర్‌లో ప్రభుత్వ అనుమతులతో చేపట్టిన జర్నలిస్టుల ఇళ్ల నిర్మాణ పనులకు ఆటంకాలు కల్పించవద్దని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. జిల్లా కార్యదర్శి మొలకలపల్లి గోపాల్ మాట్లాడుతూ ఫెడరేషన్‌ను జిల్లాలో మరింత బలోపేతం చేయనున్నట్లు తెలిపారు. కొత్త సభ్యులుగా కటికే రవీందర్ జీ, శ్రీనివాస్ గౌడ్, రామకొండ, శ్యాముల్ సుందర్ చారి, అరగిద్ద అనిల్ కుమార్ ఫెడరేషన్ కార్యకలాపాల్లో అధికారికంగా పాల్గొంటారని చెప్పారు.త్వరలో మహబూబ్‌నగర్, జడ్చర్ల, దేవరకద్ర నియోజకవర్గ కమిటీలను నియమిస్తామని, ఆర్థిక వ్యవహారాల్లో పారదర్శకత కోసం బ్యాంకు ఖాతా ప్రారంభించనున్నట్లు వెల్లడించారు.రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు ఎండి రఫీ మాట్లాడుతూ ఫెడరేషన్ కుటుంబ సభ్యులకు ఎలాంటి ఆపద వచ్చినా అండగా ఉంటుందని తెలిపారు. జాతీయ కమిటీ సభ్యుడు పసుపుల శ్రీనివాస్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంలో జర్నలిస్టులకు స్వేచ్ఛ లభించిందని పేర్కొన్నారు.

**15న తమిళనాడుకు విజ్ఞాన యాత్ర**

ఈనెల 15న ఫెడరేషన్ ఆధ్వర్యంలో జర్నలిస్టులకు విజ్ఞాన యాత్ర నిర్వహిస్తున్నట్లు డాక్టర్ బండి విజయ్ కుమార్, మొలకలపల్లి గోపాల్ తెలిపారు. బెంగళూరు, ఊటీ, కేరళ ప్రాంతాల వరకు ఈ యాత్ర కొనసాగుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో రమాకాంత్ రెడ్డి, లింగగళ్ల నరసింహులు, ఏముల నర్సిములు, మోయిజ్, ఖాజా మైనోద్దీన్, కృష్ణ మనోహర్ గౌడ్, జి. రామకృష్ణ, ఎం. దాసు, జంగం దిలీప్ కుమార్, కాడం రాఘవేందర్, మిట్టమీది బాలరాజ్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా పాలన -- ప్రగతి ప్రణాళికలో ఏఈడీపీ కోర్సులపై అవగాహన

### - విద్యార్థినులకు ఉపాధి నైపుణ్యాలే లక్ష్యంగా ప్రత్యేక ప్రజెంటేషన్

**మహబూబ్‌నగర్, మే 13 ( ప్రజా జ్యోతి బ్యూరో ) :**
ప్రజా పాలన -- ప్రగతి ప్రణాళిక మూడో రోజు కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన కమ్యూనిటీ అవేర్నెస్ కార్యక్రమం విజయవంతంగా జరిగింది. ఈ కార్యక్రమానికి నియోజకవర్గ స్థాయి ప్రజాప్రతినిధులు, కార్పొరేటర్లు, సర్పంచులు మరియు సంబంధిత అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల అటానమస్ తరపున ఏఈడీపీ కోర్సులపై ప్రత్యేక ప్రజెంటేషన్ నిర్వహించారు. కళాశాల అధ్యాపక బృందం అందించిన వీడియో ప్రజెంటేషన్‌లో ఏఈడీపీ కోర్సుల ప్రాముఖ్యతను సమగ్రంగా వివరించారు. ముఖ్యంగా డిగ్రీ మూడో సంవత్సరం నుంచే విద్యార్థులకు పరిశ్రమలతో అనుసంధానం కల్పిస్తూ వేతనంతో కూడిన అప్రెంటిస్‌షిప్ అవకాశాలు కల్పించే విధానాన్ని వివరించారు. డిగ్రీ పూర్తి చేసే సమయానికి విద్యార్థులు ఉద్యోగ నైపుణ్యాలతో సిద్ధమయ్యేలా ఈ కోర్సులు ఉపయోగపడతాయని తెలిపారు. ప్రస్తుత విద్యా సంవత్సరంలో బీఎస్సీ లైఫ్ సైన్సెస్‌లో హెల్త్ కేర్ కోర్సు, బీకాంలో బీఎఫ్ఎస్ఐ కోర్సులను ప్రవేశపెట్టిన విషయాన్ని కూడా ప్రజెంటేషన్‌లో వెల్లడించారు.ఈ కోర్సులు విద్యార్థినుల నైపుణ్యాభివృద్ధి, ఉపాధి అవకాశాల పెంపు, పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా తీర్చిదిద్దడంలో కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. ప్రజెంటేషన్ అనంతరం పాల్గొన్న ప్రజాప్రతినిధులు, అధికారులు ఏఈడీపీ కోర్సుల రూపకల్పన, ప్రాక్టికల్ అప్రోచ్ మరియు విద్యార్థుల భవిష్యత్తుకు దోహదపడే విధానాన్ని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపల్ అమీనా ముంతాజ్ జహాన్, ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక ప్రోగ్రాం కన్వీనర్ డాక్టర్ ఎం. ప్రవీణ్ కుమార్, మద్దిలేటి, డాక్టర్ ఉషా లక్ష్మి, కిషోర్ కుమార్ మరియు కళాశాల అధ్యాపక బృందం పాల్గొన్నారు.



# జడ్చర్ల మార్కెట్ యార్డ్‌లో మొక్కజొన్న కొనుగోళ్ల పరిశీలన

### - రైతులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటాం :
### -అదనపు కలెక్టర్ హరిప్రియ



**మహబూబ్‌నగర్, మే 13 ( ప్రజా జ్యోతి బ్యూరో ) :**
రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.ఎల్.బి. హరిప్రియ బుధవారం జడ్చర్ల పట్టణంలోని పత్తి మార్కెట్ యార్డ్‌ను సందర్శించి మొక్కజొన్న కొనుగోళ్లను పరిశీలించారు. మార్కెట్ యార్డ్‌లో జరుగుతున్న కొనుగోళ్ల వివరాలను అధికారులు, రైతులను అడిగి తెలుసుకున్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా మొక్కజొన్న కొనుగోళ్లను నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. రైతులు ఎలాంటి ఆందోళన చెందవద్దని భరోసా ఇచ్చారు.మార్కెట్‌కు వచ్చిన మొక్కజొన్నను వెంటనే కొనుగోలు చేయడంతో పాటు కొనుగోలు చేసిన ధాన్యాన్ని తక్షణమే తరలించేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు అదనపు కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహకార అధికారి కృష్ణ, జిల్లా మార్కెటింగ్ అధికారిణి బాలమణి, తహశీల్దార్ నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు.

## మితిమీరిన లోడ్‌తో ఎద్దుల అక్రమ రవాణా పుల్లూరు

### టోల్ ప్లాజా వద్ద డిసియం పట్టివేత



**అలంపూర్ డివిజన్ (ప్రజాజ్యోతి) మే 13:**
జోగులాంబ గద్వాల జిల్లా అలంపూర్ నియోజకవర్గంలోని ఉండవెల్లి మండల పరిధిలోని పుల్లూరు టోల్ ప్లాజా సమీపంలోని ఎన్ హెచ్ 44 చెక్‌పోస్ట్ వద్ద పోలీసులు చేపట్టిన వాహన తనిఖీల్లో ఎద్దుల అక్రమ రవాణా వెలుగుచూసింది.మంగళవారం 7 గంటల సమయంలో అనుమానాస్పదంగా వెళ్తున్న ఏపీ 39 యు కె 6629 నంబర్ గల డీసీఎం వాహనాన్ని పోలీసులు ఆపి తనిఖీ చేయగా,అందులో 12 ఎద్దులను కిక్కిరిసే విధంగా మితిమీరిన లోడ్‌తో తరలిస్తున్నట్లు గుర్తించారు.పశువులకు తీవ్ర ఇబ్బంది కలిగేలా రవాణా చేస్తున్నట్లు గుర్తించిన పోలీసులు వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు.విచారణలో ఈ ఎద్దులను షాద్‌నగర్ సమీపంలోని సర్దార్‌నగర్ సంతలో కొనుగోలు చేసి అనంతపూర్ జిల్లాకు తరలిస్తున్నట్లు తెలిసింది.
ఈ ఘటనపై అనంతపూర్‌కు చెందిన భాషా,రాము,కంబయ్య తదితరులపై కేసు నమోదు చేసినట్లు ఉండవెల్లి ఎస్సై ఆర్. శేఖర్ తెలిపారు.జిల్లాలో పశువుల అక్రమ రవాణా,జంతు హింసకు పాల్పడే వారిపై కఠిన చర్యలు కొనసాగుతాయని పోలీసులు హెచ్చరించారు.

### వివాహ వేడుకలో పాల్గొన్న ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి



**అడ్డాకుల, మే 13 ( ప్రజా జ్యోతి ) :**
అడ్డాకుల మండల కేంద్రానికి చెందిన టంకరి సుజాత -- బండలయ్య దంపతుల ప్రథమ పుత్రిక జ్యోతి వివాహ వేడుక బుధవారం ఘనంగా జరిగింది. జ్యోతి -- బాలరాజు వివాహ కార్యక్రమానికి దేవరకద్ర నియోజకవర్గ ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో అడ్డాకుల గ్రామ సర్పంచ్ బి. దశరథ రెడ్డి కూడా పాల్గొన్నారు. ఈ వివాహ వేడుకలో మదనపురం మార్కెట్ కమిటీ సభ్యుడు శేఖర్ రెడ్డి, దేవరకద్ర మైనారిటీ సెల్ అధ్యక్షుడు షఫీ, రవీందర్ రెడ్డి, జగదీష్ ఆచారి, ఎల్లన్న, పెళ్లికూతురు బాబాయిలు శరవంద రమేష్, నరేష్ పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇళ్ల పథకం పేదల సొంతింటి కలను నెరవేరుస్తోంది

## పచ్చర్ల కుమార్

**వడ్డేపల్లి మే 13(ప్రజా జ్యోతి):**
పేదల సొంతింటి కలను నిజం చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని అలంపూర్ మాజీ శాసనసభ్యులు,ఏఐసీసీ కార్యదర్శి డాక్టర్ ఎస్.ఏ.సంపత్ కుమార్ ఆదేశాల మేరకు అలంపూర్ మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ పచ్చర్ల కుమార్ తెలిపారు.వడ్డేపల్లి మున్సిపాలిటీ పరిధిలోని నాలుగవ వార్డు సభ్యురాలు బజారి అంజలికి మంజూరైన ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశ కార్యక్రమాన్ని బుధవారం రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు.ఈ సందర్భంగా పచ్చర్ల కుమార్ మాట్లాడుతూ, ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రభుత్వం పేదల జీవితకాల కలను నెరవేర్చేందుకు ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తోందని పేర్కొన్నారు.వడ్డేపల్లి మండలంలో మొదటి విడతలో మంజూరైన ఇందిరమ్మ ఇళ్లలో పూర్తయిన ఇంటిని ప్రారంభించడం సంతోషకరమని ఆయన తెలిపారు.ఈ అవకాశం కల్పించిన సంపత్ కుమార్‌కు కృతజ్ఞతలు తెలిపారు.అలంపూర్ నియోజకవర్గంలో రేషన్ కార్డులు,సన్నబియ్యం,ఇందిరమ్మ ఇళ్లు వంటి అనేక సంక్షేమ పథకాలు అమలవుతున్నాయని,ప్రజలు రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నారని ఆయన అన్నారు.ఈ కార్యక్రమంలో వడ్డేపల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బంగారు రామకృష్ణారెడ్డి,జిల్లా కిసాన్ సెల్ అధ్యక్షులు





ఎసుముల నాగరాజు,జిల్లా మహిళా అధ్యక్షురాలు నాగ శిరోమణి,టౌన్ ప్రెసిడెంట్ చిన్నిబాబు,ఎస్సీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు దేవేంద్ర,సోషల్ మీడియా కోఆర్డినేటర్ సంధ్య బాబు,కాంగ్రెస్ నాయకులు,కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# మాజీ మున్సిపల్ కౌన్సిలర్ ఉమాశంకర్ గౌడ్‌కు ఘన సన్మానం



**జడ్చర్ల, మే 13 ( ప్రజా జ్యోతి ) :**
జడ్చర్ల పట్టణంలోని హౌసింగ్ బోర్డ్ కాలనీలో సీనియర్ ఫ్రెండ్స్ ఆధ్వర్యంలో మాజీ మున్సిపల్ కౌన్సిలర్ ఉమాశంకర్ గౌడ్ కు ఘన సన్మానం నిర్వహించారు. గత ఐదేళ్ల పాటు ప్రజలకు అందించిన సేవలను గుర్తిస్తూ ఆయనను అభినందించారు. ఈ సందర్భంగా మహమ్మద్ ఖాసిం శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందజేసి ఉమాశంకర్ గౌడ్‌ను ఘనంగా సత్కరించారు. కార్యక్రమం స్నేహపూర్వక, ఉత్సాహభరిత వాతావరణంలో కొనసాగింది. టీమ్ సభ్యులు ఉమాశంకర్ గౌడ్‌కు శుభాకాంక్షలు తెలియజేశారు.
ఈ కార్యక్రమంలో కిషోర్, శశికాంత్, సత్తార్, శ్రీనివాస్, హర్షవర్ధన్ తదితరులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

# వడ్డేపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యా వారోత్సవాలు

**వడ్డేపల్లి మే 13(ప్రజా జ్యోతి):**
వడ్డేపల్లి మున్సిపాలిటీ కేంద్రంలోని శాంతినగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా విద్యా వారోత్సవాలు,పూర్వ విద్యార్థుల ప్రోత్సాహ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి మున్సిపల్ చైర్మన్ మంజుల ధర్మ అధ్యక్షత వహించగా,కౌన్సిలర్లు చిన్ని బాబు,విజయ్ భాస్కర్,విద్యాశాఖ అధికారులు,ఉపాధ్యాయులు,పూర్వ విద్యార్థులు హాజరై విద్యార్థులను ప్రోత్సహించారు.ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ మంజుల ధర్మ మాట్లాడుతూ ప్రభుత్వ విద్యాసంస్థల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని పిలుపునిచ్చారు.మాజీ జెడ్పీటీసీ వడ్డేపల్లి శ్రీనివాసులు సహకారంతో కళాశాల అభివృద్ధికి తమ వంతు సహాయం అందిస్తామని తెలిపారు.కౌన్సిలర్ చిన్ని బాబు మాట్లాడుతూ రవీంద్ర హైస్కూల్,ప్రభుత్వ డిగ్రీ కళాశాల స్థాపనకు తమ తాత బసవపూర్ణయ్య స్థలం అందించడం గర్వకారణమని పేర్కొన్నారు.కళాశాల లైబ్రరీ అభివృద్ధికి రూ.30,000 నుండి రూ.40,000 వరకు సహాయం అందిస్తానని ప్రకటించారు.కౌన్సిలర్ విజయ భాస్కర్ మాట్లాడుతూ,పూర్వ విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించి మంచి ఉద్యోగాల్లో స్థిరపడుతూ కళాశాలకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.ప్రస్తుత విద్యార్థులు క్రమశిక్షణతో చదివి ఉన్నత స్థానాలను చేరుకోవాలని సూచించారు.ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు తమ విద్యా అనుభవాలను పంచుకుంటూ కళాశాల అభివృద్ధికి






అవసరమైన సూచనలు అందించారు.విద్యార్థులకు ఉన్నత విద్య,ఉద్యోగావకాశాలు,పోటీ పరీక్షలపై అవగాహన కల్పించారు.అనంతరం పూర్వ విద్యార్థులను ప్రజాప్రతినిధులు,ఉపాధ్యాయులు, విద్యాశాఖ అధికారులు ఘనంగా సన్మానించారు.కార్యక్రమం ఉత్సాహభరిత వాతావరణంలో సాగింది.

# నస్రుల్లాబాద్ బొడ్రాయి ఉత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి

**జడ్చర్ల, మే 13 ( ప్రజా జ్యోతి ) :**
జడ్చర్ల మండలంలోని నస్రుల్లాబాద్ గ్రామంలో ఘనంగా నిర్వహించిన బొడ్రాయి ఉత్సవాల్లో జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి పాల్గొన్నారు.
గ్రామ ప్రజలు, యువకులు, మహిళలు ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు నిర్వహించి గ్రామ ప్రజలు సుఖసంతోషాలతో



ఉండాలని ఆకాంక్షించారు. గ్రామీణ సంస్కృతి, సంప్రదాయాలను కాపాడే ఇలాంటి ఉత్సవాలు సామాజిక ఐక్యతకు ప్రతీకలని ఎమ్మెల్యే పేర్కొన్నారు.

# చిన్నంబావి మండల కేంద్రంలో లబ్ధిదారుల ధ్రువపత్రాల పరిశీలన పూర్తి

**చిన్నంబావి, మే 13(ప్రజాజ్యోతి)**
ఎస్సీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో స్వయం ఉపాధి, సబ్సిడీ రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారుల ఇంటర్వ్యూలు, ధ్రువపత్రాల పరిశీలన కార్యక్రమం బుధవారం చిన్నంబావి మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో నిర్వహించారు. వివిధ బ్యాంకుల అధికారులు, కార్పొరేషన్ సిబ్బంది అభ్యర్థుల సర్టిఫికెట్లను పరిశీలించి అర్హతలను నిర్ధారించారు.ఎస్సీ కార్పొరేషన్ జూనియర్ అసిస్టెంట్ కృష్ణయ్య, ఎంపీఓ రామస్వామి పర్యవేక్షణలో జరిగిన ఈ ప్రక్రియలో చిన్నంబావి ఎస్బీఐ మేనేజర్ అలీ భాషా, జటపోలు యూనియన్ బ్యాంక్ మేనేజర్ కృష్ణప్రసాద్, పెంట్లవెల్లి బ్యాంక్ మేనేజర్ రామకృష్ణ, వీపనగండ్ల బ్యాంక్ మేనేజర్ తదితరులు పాల్గొన్నారు.స్వయం ఉపాధి పథకాల కింద ఆటోలు, గొర్రెలు--మేకల పెంపకం, బర్రెల పెంపకం యూనిట్ల కోసం దరఖాస్తు చేసుకున్న మొత్తం 66 మంది లబ్ధిదారులు ఇంటర్వ్యూలకు హాజరయ్యారు. అభ్యర్థుల ఆదాయ, కుల, నివాస ధ్రువపత్రాలతో పాటు ఇతర అవసరమైన పత్రాలను అధికారులు క్షుణ్ణంగా పరిశీలించారు. మంజూరుకు ప్రతిపాదించిన 11 యూనిట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించనున్నట్లు అధికారులు తెలిపారు.ప్రభుత్వం అందిస్తున్న రుణాలు, సబ్సిడీ పథకాలను సద్వినియోగం చేసుకుని స్వయం ఉపాధి ద్వారా ఆర్థికంగా అభివృద్ధి చెందాలని లబ్ధిదారులకు సూచించారు. కార్యక్రమంలో స్థానిక సిబ్బంది, అభ్యర్థులు పాల్గొన్నారు.



# క్రిస్టియన్‌పల్లి ప్రమాద బాధితులను పరామర్శించిన ఎమ్మెల్యేలు

**- క్షతగాత్రులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని వైద్యులకు ఆదేశం**

**మహబూబ్‌నగర్, మే 13 ( ప్రజా జ్యోతి బ్యూరో ) :**
శుభకార్యానికి వెళ్తున్న ఓ వాహనం క్రిస్టియన్‌పల్లి సమీపంలో అదుపుతప్పి బోల్తాపడిన ఘటనలో సుమారు 15 మంది ప్రయాణికులు తీవ్రంగా గాయపడ్డారు. గాయపడిన వారిని మహబూబ్‌నగర్ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి తరలించి వైద్యులు చికిత్స అందిస్తున్నారు.
ఈ విషయం తెలుసుకున్న ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి ఆసుపత్రికి చేరుకుని చికిత్స పొందుతున్న క్షతగాత్రులను పరామర్శించారు. దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డితో కలిసి బాధితులను ఓదార్చి వారి ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి వైద్యులతో మాట్లాడి గాయపడిన వారికి అత్యుత్తమ వైద్య సేవలు అందించాలని ఆదేశించారు. అవసరమైన అన్ని రకాల చికిత్సలు తక్షణమే అందించాలని, బాధితుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు.
బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని, అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు



చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ప్రమాదంలో గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో నగర డిప్యూటీ మేయర్ సురేందర్ రెడ్డి, ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, హాస్పిటల్ డెవలప్‌మెంట్ కమిటీ సభ్యులు బెజ్జుగం రాఘవేందర్, నాయకులు యాదిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# చికెన్ వేస్ట్ ను అక్రమంగా చేపల చెరువులకు తలించి కార్పొరేషన్ ఆదాయానికి గండి కొడితే సహించేది లేదు

- కార్పొరేటర్ గుండా సంతోష్
- చికెన్ వేస్ట్ టెండర్ వ్యవహారంపై ఆరోపణలు
- టెండర్ దారునికి అన్యాయం జరిగిందంటూ ఆగ్రహం





**మహబూబ్‌నగర్, మే 13 ( ప్రజా జ్యోతి బ్యూరో ) :** మహబూబ్‌నగర్ మున్సిపాలిటీలో చికెన్ వేస్ట్ టెండర్ వ్యవహారంపై వివాదం నెలకొంది. టెండర్ దక్కించుకున్న వ్యక్తికి అన్యాయం జరుగుతోందంటూ పలువురు స్థానిక నాయకులు ఆరోపణలు వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో బీజేపీ కార్పొరేటర్లు గుండా సంతోష్ అధ్వర్యంలో బుధ వారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ

చికెన్ వేస్ట్ సేకరణ అంశంపై గత రెండు సంవత్సరాలుగా మున్సిపల్ కమిషనర్ నిర్వహించే కౌన్సిల్ సమావేశంలో చర్చ జరగలేదని, ఇటీవల నిర్వహించిన కౌన్సిల్ సమావేశంలో తొలిసారిగా టెండర్ ప్రక్రియ చేపట్టి కార్పొరేషన్ ఆదాయాన్ని పెంచాలని తీర్మానించినట్లు తెలిపారు. ఈ మేరకు ఈనెల 5న మున్సిపల్ కమిషనర్ ఆధ్వర్యంలో పారదర్శకంగా టెండర్ నిర్వహించగా ముగ్గురు వ్యక్తులు పాల్గొన్నారని, అందులో ఇనాయత్ అలీ రూ.25 లక్షలకు పైగా పాడి టెండర్ దక్కించుకున్నట్లు, అదేవిధంగా కార్పోరేషన్ కు టెండర్ లో సగం అమౌంట్ కట్టనప్పటికి అక్రమంగా తరలిస్తున్న వారు యదేచ్ఛగా చికెన్ వేస్ట్ ను సేకరిస్తున్నారు అని పేర్కొన్నారు. అయితే టెండర్ అనంతరం ఆరో తేదీ నుంచి చికెన్ వేస్ట్ సేకరణకు వెళ్లగా ఇప్పటికే కొందరు వ్యక్తులు కార్పోరేషన్ ఆదాయానికి గండి కొడుతూ అక్రమంగా సేకరణ కొనసాగిస్తు చేపల పెంపకం దారులకు అమ్ముకుని సొమ్ము చేసుకుంటున్నారని వారు ఆరోపించారు. ఈ క్రమంలో సదరు టెండర్ దారు మంగళ వారం అనుమతులు లేకుండా చికెన్ వేస్ట్ ను సేకరిస్తున్న బొలెరో వాహనాన్ని అడ్డుకుని 100 కు డయల్ చేయడంతో పాటు వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. పోలీసులు వాహనాన్ని స్వాధీనం చేసుకుని మున్సిపల్ అధికారులకు అప్పగించగా, అనంతరం కొందరి రాజకీయ జోక్యంతో వాహనం రాత్రికి రాత్రే విడుదలైందని ఆరోపించారు. టెండర్ ప్రక్రియ పూర్తయిన తర్వాత ఆయా చికెన్ షాపులకు అధికారిక నోటీసులు జారీ చేయాల్సి ఉండగా ఇప్పటివరకు ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. అక్రమంగా చికెన్ వేస్ట్ సేకరణ కొనసాగుతున్నప్పటికీ సంబంధిత అధికారుల చర్యలు కనిపించడం లేదని విమర్శించారు. బుధవారం వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో అక్రమంగా చికెన్ వేస్ట్ సేకరిస్తున్న ముగ్గురిపై టెండర్ లో చికెన్ వేస్ట్ సేకరణను పొందిన ఇనాయత్ అలీ ముగ్గురు వ్యక్తులపై ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. అయినప్పటికీ సంబంధిత వాహనాన్ని మున్సిపల్ సిబ్బంది ఎందుకు విడుదల చేశారనే అంశంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయని పేర్కొన్నారు. పాలమూరు ను అభివృద్ధి చేయకపోయినా చూస్తూ ఉరుకుంటాం కానీ కార్పోరేషన్ ఆదాయానికి గండి కొడితే సహించేది లేదని, కొంతమంది ప్రజాప్రతినిధుల సహకారంతోనే "చికెన్ మాఫియా" కార్యకలాపాలు కొనసాగుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయని, ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. టెండర్ ప్రక్రియ ద్వారా సేకరించిన చికెన్ వేస్ట్ ను కంపెనీలకు తలించి పద్దతి ప్రకారం వాడకం జరుగుతుందని, అక్రమంగా చేపల పెంపకం దారులకు సరఫరా చేయడం వల్ల ఆ వ్యర్థాలు తిని పెరిగిన చేపలు తిరిగి మహబూబ్ పట్టణం లో విక్రయించడం ద్వారా అవి తిన్న ప్రజలు రోగాల బారి న పడతారని, కొందరి స్వార్థ ప్రయోజనాల కోసం ప్రజల ఆరోగ్యంతో చెలగాటం ఆడితే సహించబోమని, అవసరమైతే కార్పొరేటర్లు పెద్దఎత్తున తిరుగుబాటు చేస్తామని వారు హెచ్చరించారు.

## వడదెబ్బ నివారణపై విస్తృత అవగాహన కార్యక్రమాలు

**మహబూబ్‌నగర్, మే 13 ( ప్రజా జ్యోతి బ్యూరో )**

"ప్రజా పాలన -- ప్రగతి ప్రణాళిక" 99 రోజుల కార్యక్రమంలో భాగంగా జిల్లా వ్యాప్తంగా వడదెబ్బ నివారణ చర్యలను విస్తృతంగా చేపట్టినట్లు జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారులు తెలిపారు. బుధవారం నిర్వహించిన కార్యక్రమాల్లో భాగంగా ప్రజలకు, ముఖ్యంగా 218 మంది ఉపాధి హామీ పథకం కూలీలకు వడదెబ్బ బారిన పడకుండా అవగాహన కల్పించారు. అలాగే మొత్తం 2024 ఓ అర్ ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేశారు. క్షయ నిర్ధారణ కార్యక్రమంలో భాగంగా బాలానగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని బాలానగర్, మొగఘునపూర్ గ్రామాల్లో ప్రత్యేక ఆరోగ్య శిబిరాలు నిర్వహించారు. ఈ శిబిరాల్లో 101 మందికి ఎక్స్‌రే పరీక్షలు, ఒకరికి కఫ పరీక్ష నిర్వహించినట్లు అధికారులు వెల్లడించారు. దోమల ద్వారా వ్యాపించే వ్యాధుల నివారణ కార్యక్రమంలో భాగంగా పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో ఇంటింటి సర్వే చేపట్టి ప్రజలకు అవగాహన కల్పించారు. మొత్తం



703 గృహాలను సందర్శించి నీటి నిల్వల్లో లార్వా పరిశీలించగా 32 గృహాల్లో లార్వా గుర్తించి నిర్మూలన చర్యలు చేపట్టారు. అదేవిధంగా జ్వరంతో బాధపడుతున్న 26 మందిని గుర్తించి రక్త పరీక్షలు నిర్వహించి అవసరమైన చికిత్స అందించినట్లు వైద్య శాఖ అధికారులు తెలిపారు.

## బండి సాయి భగీరథను అరెస్ట్ చేయాలని మద్దూరులో ప్రజా సంఘాల రాస్తారోకో

**మద్దూర్ మండల ప్రతినిధి ప్రజాజ్యోతి మే13:**
మైనర్ బాలికపై లైంగిక వేధింపులకు పాల్పడినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న బండి సాయి భగీరథను వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేస్తూ మద్దూర్ మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం, ప్రజా సంఘాల నాయకులు మాట్లాడుతూ కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ తన పదవికి రాజీనామా చేయాలని, బండి సాయి భగీరథపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం సిట్ విచారణ పేరుతో కేసును నీరుగార్చే ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు. బాధిత బాలికకు న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగిస్తామని హెచ్చరించారు. పోలీసులు నామమాత్రపు కేసులు నమోదు చేసి చేతులు దులుపుకుంటున్నారని విమర్శించిన నాయకులు, పేదలకు ఒక న్యాయం -- పెద్దలకు మరో న్యాయం అన్నట్లుగా రాష్ట్ర ప్రభుత్వ వైఖరి ఉందని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి అశోక్, విజ్ఞాన దర్శిని రాష్ట్ర కార్యదర్శి మొహ్మద్ అలీ, సీఐటీయూ మండల నాయకులు ఎలప్ప, రైతు సంఘం నాయకులు సాయిలు, సుక్కప్ప, డివైఎఫ్ఐ నాయకులు కురుమప్ప, అంబేద్కర్ సంఘం నాయకులు ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.



## వరి ధాన్యం అన్‌లోడింగ్‌లో జాప్యం చేయవద్దు

– రైస్ మిల్లర్లకు అదనపు కలెక్టర్ హరిప్రియ ఆదేశాలు



**మహబూబ్‌నగర్, మే 13 ( ప్రజా జ్యోతి బ్యూరో ) :**
కొనుగోలు కేంద్రాల నుంచి వచ్చే వరి ధాన్యాన్ని రైస్ మిల్లర్లు ఎలాంటి జాప్యం లేకుండా వెంటనే అన్‌లోడింగ్ చేసుకోవాలని రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.ఎల్.బి. హరిప్రియ ఆదేశించారు. బుధవారం మహబూబ్‌నగర్ పట్టణంలోని సురేష్ ఇండస్ట్రీస్, గణేష్ ఇండస్ట్రీస్ రైస్ మిల్లులను ఆమె సందర్శించి ధాన్యం అన్‌లోడింగ్ ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ఉదయం 6 గంటల నుంచే ధాన్యం అన్‌లోడింగ్ ప్రక్రియ ప్రారంభించాలని సూచించారు. అలా చేయడం ద్వారా కొనుగోలు కేంద్రాల నుంచి ధాన్యాన్ని సకాలంలో రవాణా చేసేందుకు వీలవుతుందని తెలిపారు. హమాలీలను అదనంగా ఏర్పాటు చేసుకుని వేగంగా అన్‌లోడింగ్ పనులు చేపట్టాలని మిల్లర్లకు సూచించారు. రైతులకు ఇబ్బందులు కలగకుండా ధాన్యం తరలింపు, నిల్వ ప్రక్రియలను సమర్థవంతంగా నిర్వహించాలని అధికారులకు ఆదేశించారు.
ఈ కార్యక్రమంలో పౌర సరఫరాల డీటీ రాజీవ్ రెడ్డి పాల్గొన్నారు.

## తడిసిన ధాన్యం కొనుగోలుపై రైతుల ఆందోళన



**జడ్చర్ల, మే 13 ( ప్రజా జ్యోతి ) :**
బాదేపల్లి వ్యవసాయ మార్కెట్‌లో బుధవారం సాయంత్రం కురిసిన చిన్నపాటి వర్షానికి మార్కెట్ యార్డులో నిల్వ ఉంచిన ధాన్యం తడిసిపోయింది. దీంతో రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే టెండర్లు వేసి కొనుగోలు చేపట్టాల్సిన వ్యాపారులు తడిసిన ధాన్యాన్ని కొనలేమంటూ వెనక్కి తగ్గుతున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. తమ కష్టానికి న్యాయం చేయాలని రైతులు కోరుతున్నప్పటికీ సమస్యపై మాట్లాడేందుకు మార్కెట్ చైర్‌పర్సన్, డైరెక్టర్లు, సంబంధిత అధికారులు అందుబాటులో లేకపోవడం ఆగ్రహానికి కారణమైంది. వర్షంతో తడిసిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేసి రైతులకు నష్టం జరగకుండా చర్యలు తీసుకోవాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. అధికారులు తక్షణమే మార్కెట్ యార్డుకు చేరుకుని సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

## విద్యా ప్రగతికి ప్రజాప్రతినిధులే కీలకం

### అదనపు కలెక్టర్ నర్సింగరావు

అలంపూర్ డివిజన్ (ప్రజాజ్యోతి) మే 13:

తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న 99 రోజుల విద్యా – –పాలన ప్రగతి ప్రణాళిక"లో భాగంగా అలంపూర్ నియోజకవర్గ ప్రజాప్రతినిధులకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాల విద్యాభివృద్ధి ప్రభుత్వ పాఠశాలల బలోపేతం, విద్యార్థుల హాజరు పెంపు పాఠశాల మౌలిక వసతుల అభివృద్ధి, సమాజ భాగస్వామ్యం వంటి అంశాలపై అవగాహన కల్పించారు. ప్రతి గ్రామాన్ని విద్యా ప్రగతిలో ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు ప్రజాప్రతినిధులు కీలక పాత్ర పోషించాలని అధికారులు సూచించారు. సర్పంచులు మునిసిపల్ చైర్మన్‌లు కౌన్సిలర్లు సమన్వయంతో పనిచేసి విద్యార్థుల భవిష్యత్ నిర్మాణానికి తోడ్పడాలని పిలుపునిచ్చారు. ముగింపు కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ నర్సింగరావు మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలల బలోపేతంలో ప్రజాప్రతినిధుల పాత్ర ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు. అనంతరం ప్రజా ప్రతినిధులతో ప్రతిజ్ఞ చేయించి సమావేశాన్ని ముగించారు. ఈకార్యక్రమంలో విద్యాశాఖ అధికారులు, మండల స్థాయి అధికారులు, ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# వైద్య ఆరోగ్య శాఖ పై సమీక్షించిన కలెక్టర్

**నారాయణపేట ప్రతినిధి మే 13 ప్రజా జ్యోతి**

జిల్లా వైద్య ఆరోగ్య శాఖ పై జిల్లా కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో బుధవారం సాయంత్రం జిల్లా కలెక్టర్ సీ హెచ్ ప్రియాంక సమీక్ష నిర్వహించారు. సమీక్షలో జిల్లాలోని 11 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఒక అర్బన్ హెల్త్ సెంటర్, 27 సబ్ సెంటర్లు,59 పల్లె దవాఖానా ల పనితీరు పై చర్చించారు.

అలాగే ఎన్ సి హెచ్ సర్వీస్, చైల్డ్ ఇమ్యునైజేషన్, టి బి ప్రోగ్రామ్ ఎన్ సి డి, ఎన్ ఎల్ ఈ పి ప్రోగ్రామ్ నివేదికల గురించి సంబంధిత విభాగాల అధికారులు వివరించారు. వీటిలో పాటు ఈ డిడి , ప్రభుత్వ ఆసుపత్రి లలో జనన మరణాల సంఖ్య, ఆరోగ్య మహిళా ప్రోగ్రామ్, ఫ్యామిలీ ప్లానింగ్ ప్రోగ్రామ్ తదితర వాటి పై చర్చించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. కేవలం నివేదికలు కాకుండా ప్రభుత్వ వైద్యంపై ప్రజల్లో పూర్తి విశ్వాసం, భరోసా కలిగేలా సేవలు అందించాలన్నారు.

మహిళల ఆరోగ్యం కోసం బ్రెస్ట్ క్యాన్సర్ పరీక్షలు నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. మహిళల్లో వచ్చే బ్రెస్ట్ క్యాన్సర్ నివారణకు చర్యలు తీసుకోవాలని ప్రతి ఒక్కరికి పరీక్ష నిర్వహించాలన్నారు. ముఖ్యంగా ఎస్ హెచ్ జి గ్రూపుల సభ్యుల కు బ్రెస్ట్ పరీక్షలు నిర్వహించాలన్నారు. పిహెచ్ సీ కేంద్రాల మెడికల్ ఆఫీసర్ల దగ్గర మహిళల బ్రెస్ట్ క్యాన్సర్ సంబంధించిన పరీక్షల ప్రొఫైల్ ఉండాలని స్పష్టం చేశారు. . అలాగే ప్రభుత్వం అమలు చేస్తున్న వైద్య సంక్షేమ పథకాల అమలు గురించి అడిగి తెలుసుకున్నారు. టీ హబ్ శాంపిల్స్ మహబూబ్ నగర్ కు పంపిస్తున్నట్లు డిఏఓ కలెక్టర్ కు తెలిపారు. ప్రభుత్వ ఆస్పత్రులు, ప్రైవేట్ ఆస్పత్రులలో జరిగిన సాధారణ ప్రసవాలు, సిజరిన్ ప్రసవాల పై ఆరా తీశారు. ఏఎన్ఎంలు ఎన్ని కేసులు తీసుకువస్తారని ప్రశ్నించారు. క్యాన్సర్ టీబీ పేషెంట్లకు సరైన వైద్యం అందించాలని ఆదేశించారు. మళ్లీ వచ్చే సమావేశానికి అన్ని వివరాలతో రావాలని కలెక్టర్ ఆదేశించారు. త్వరలో టీ హబ్ ప్రారంభించాలని తెలిపారు.






ఈ కార్యక్రమంలో డిఎంహెచ్ ఓ డాక్టర్ జయ చంద్రమోహన్ మోహన్, డిపివో బిక్షపతి, అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు, తదితరులు పాల్గొన్నారు

# కొనుగోలు కేంద్రాన్ని ఆకస్మిక తనిఖీ చేసిన మంత్రి వాకిటి శ్రీహరి

### గన్ని బ్యాగుల కొరత లేకుండా చూడాలి మంత్రి వాకిటి శ్రీహరి

**నర్వ, మే 13 ప్రజా జ్యోతి**

నారాయణపేట జిల్లానర్వ మండల కేంద్రంలోని మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని రాష్ట్ర క్రీడా, పాడి పరిశ్రమాభివృద్ధి, పశుసంవర్ధక శాఖ మంత్రి వాకిటి శ్రీహరి బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. కొనుగోలు కేంద్రం వద్ద రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు, మొక్కజొన్న నిల్వలు, తూకం ప్రక్రియ, గన్ని బ్యాగుల లభ్యత తదితర అంశాలను మంత్రి స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులు గన్ని బ్యాగుల కొరత కారణంగా కొనుగోళ్లు ఆలస్యం అవుతున్నాయని మంత్రికి వివరించారు. దీనిపై స్పందించిన మంత్రి వెంటనే మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజర్ శ్రీలతకు ఫోన్ చేసి గన్ని బ్యాగుల కొరత లేకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రైతులు ఇబ్బందులు పడకుండా కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని స్పష్టం చేశారు. మొక్కజొన్న కొనుగోళ్లలో జాప్యం జరిగితే సంబంధిత అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటానని మంత్రి హెచ్చరించారు. కొనుగోలు కేంద్రాల్లో ఎలాంటి అవకతవకలు, తూకంలో అక్రమాలు, రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేపట్టాలని



సూచించారు. రైతుల పంటకు ప్రభుత్వం పూర్తి మద్దతు అందిస్తోందని, ప్రతి గింజను కొనుగోలు చేసేలా చర్యలు తీసుకుంటామని మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమంలో నర్వ మండల వ్యవసాయ శాఖ అధికారి అఖిలా రెడ్డి, సింగిల్ విండో చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి, సీఈఓ ఉదయ్, ఆత్మకూరు మార్కెట్ వైస్ చైర్మన్ కృష్ణారెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు చెన్నయ్య సాగర్, నాయకులు శ్రీనివాస్ రెడ్డి, వివేకవర్ధన్ రెడ్డి, శరణప్ప తదితర నాయకులు, అధికారులు, రైతులు పాల్గొన్నారు.

# మైనర్ బాలిక ఘటనపై గద్వాలలో అఖిలపక్ష నిరసన


### –భగీరథ్‌ను వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్

**గద్వాల ప్రజా జ్యోతి మే 13:**

మైనర్ బాలికపై జరిగిన అత్యాచార ఘటనలో కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని ఆరోపిస్తూ గద్వాల జిల్లా అఖిలపక్ష నాయకులు బుధవారం జిల్లా కేంద్రంలోని కృష్ణవేణి చౌరస్తాలో నిరసన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ,కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమారుడు భగీరథ్‌పై పోక్సో కేసు నమోదైనా ఇప్పటివరకు అరెస్ట్ చేయకపోవడం ప్రభుత్వ వైఖరికినిదర్శనమన్నారు.కేసు నమోదైన 48 గంటల్లోపు నిందితుడిని అరెస్ట్ చేసి చట్టపరమైన చర్యలుతీసు కోవాల్సిందిపోయి ఆలస్యం చేయడంఅనుమానాలకు తావిస్తోందని విమర్శించారు.రాజకీయ పలుకుబడితో కేసును నిర్వీర్యం చేసే ప్రయత్నాలుజరుగుతున్నాయని,బాధిత కుటుంబంపై అసత్య ఆరోపణలు చేయడం దారుణమన్నారు.బేటీ బచావో బేటీ పడావో" నినాదం కేవలం మాటలకేపరిమితమైందని,మహిళల భద్రత విషయంలో బీజేపీ ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు.కేంద్ర మంత్రి బండి సంజయ్‌ను కేంద్ర క్యాబినెట్ నుంచి తొలగించి,భగీరథ్‌ను వెంటనే అరెస్ట్ చేసి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో వివిధ రాజకీయ పార్టీలు,ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.



# కురుమన్నకు సన్మానం



**గద్వాల (ప్రజా జ్యోతి) మే13:**

జోగులాంబ గద్వాల జిల్లా ఎస్సీ,ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యుడిగా గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి సహకారంతో గద్వాల నియోజకవర్గం నుంచి కమిటీ సభ్యుడిగా అవకాశం దక్కడంతో కురుమన్నను స్థానిక నాయకులు ఘనంగాగద్వాల నియోజకవర్గం జిల్లా ఉప సర్పంచ్‌ల మాజీ అధ్యక్షుడు ఎస్. రంజిత్ కుమార్, తాటికుంట తిరుమల్ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం శాలువా, పూలమాలతో కురుమన్నను సత్కరించి అభినందనలు తెలియజేశారు.

# హార్వెస్టర్ ఢీకొని వ్యక్తికి తీవ్ర గాయాలు

**గోపాల్‌పేట, మే 13 (ప్రజాజ్యోతి):**

అజాగ్రత్తగా వచ్చిన హార్వెస్టర్ ఢీకొని ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడిన ఘటన గోపాల్‌పేట మండల పరిధిలోని దేవరగుట్ట తండా సమీపంలోని బండ్లబాట వద్ద చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. గొల్లపల్లి గ్రామానికి చెందిన పగడాల శాంతయ్య (50) సోమవారం సాయంత్రం సుమారు 7 గంటల సమయంలో బైక్ (ు+31దీ2818)పై పెబ్బేరు వైపు వెళ్తుండగా, పక్కనుంచి వచ్చిన హార్వెస్టర్ (ు+32బా5702) ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో శాంతయ్య కుడిచేయి విరగడంతో పాటు పక్కటెముకలకు తీవ్ర గాయాలయ్యాయి. గాయపడిన శాంతయ్యను తొలుత వనపర్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి ప్రాథమిక చికిత్స అందించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రికి తరలించారు. బాధితుడి బంధువు పగడాల ఆదాం ఫిర్యాదు మేరకు హార్వెస్టర్ డ్రైవర్ పాతావత్ ప్రభాస్‌పై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# బీజేపీ కార్యకర్తలకు అండగా డాక్టర్ వెన్న ఈశ్వరప్ప



**గండేడ్ మే 13(ప్రజా జ్యోతి)**

వెన్నచెడ్ గ్రామంలో ఈరోజు భారతీయ జనతా పార్టీ కార్యకర్తలకు అండగా నిలుస్తూ డాక్టర్ వెన్న ఈశ్వరప్ప మానవత్వాన్ని చాటుకున్నారు. మండల బీజేపీ ప్రెస్ మీడియా ఇంచార్జ్ నవీన్ ఆరోగ్య పరిస్థితిని స్వయంగా అడిగి తెలుసుకుని, ఆయనకు ఆర్థిక సహాయం అందించారు. ఈ సందర్భంగా నవీన్ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

అలాగే బీజేపీ కార్యకర్త శ్రీను వారి తండ్రి మృతి చెందిన విషయం తెలుసుకున్న డాక్టర్ వెన్న ఈశ్వరప్ప, వారి ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. శ్రీను కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ ఓదార్పునిచ్చారు. ఈ సందర్భంగా కుటుంబానికి ఆర్థిక సహాయం అందించి తమవంతు సహకారం చేశారు.పార్టీ కార్యకర్తల కష్టసుఖాల్లో ఎల్లప్పుడూ అండగా ఉంటానని డాక్టర్ వెన్న ఈశ్వరప్ప తెలిపారు.

